# ఆంధ్రజ్యోతి

20 పేజీలు

సిద్దిపేట



ఆదివారం 7 జనవరి 2018


## నేడు ముత్యాల ముగ్గుల పోటీలు

**'ఆంధ్రజ్యోతి–ఏబీఎన్' ఆధ్వర్యంలో గజ్వేల్‌లో రంగవల్లుల పోటీ**

- హాజరుకానున్న ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, సినీతారలు, ప్రముఖులు
- మల్లారెడ్డి గార్డెన్స్‌లో ఉదయం 10 గంటలకు ప్రారంభం



5



సిద్దిపేట బాలికల పాఠశాలలో వెజ్ బిర్యానీకి బదులు అన్నం, పప్పు వడ్డన

## తొలిరోజు బిర్యానీ అంతంతే!

ప్రతి శనివారమూ మధ్యాహ్న భోజనంలో వెజ్ బిర్యానీని అందించాలని తాజాగా విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఆదేశాలను అన్ని జిల్లాల విద్యాధికారులకు చేరవేశారు. జనవరి 6 నుంచే పాఠశాలల్లో పకడ్బందీగా అమలు చేయాలని సూచనలు చేశారు. ఎంతో ఆశగా ఎదురుచూసిన విద్యార్థులకు నిరాశే ఎదురైంది. తొలిరోజు కొన్ని చోట్ల మాత్రమే వెజ్ బిర్యానీని వడ్డించారు. మిగతా చోట్ల తెల్లన్నం, పప్పుచారు వడ్డించారు. వెజ్ బిర్యానీ చేసిన చోట కూడా తెల్లన్నంలోనే నాలుగు ఆలుగడ్డ, క్యారెట్, పచ్చిమిర్చి వేసి చేతులు దులుపుకున్నారు. తమకు ఆదేశాలు వచ్చినందునే సిద్ధం చేశామని కొందరు పాఠశాల నిర్వాహకులు తెలపగా, మరికొందరు అసలు అందలేదని చెప్పారు. దీనిపై జిల్లా విద్యాధికారికి ఇది కూడా స్పష్టత లేదు.

- శనివారం స్పెషల్‌ను రుచిచూడని మెజార్టీ విద్యార్థులు
- మధ్యాహ్న భోజనంలో సగం పాఠశాలలో కూడా కానరాని వెజ్ బిర్యానీ
- తెల్లన్నం, కూరతోనే కడుపునింపిన నిర్వాహకులు
- ఆదేశాలపై స్పష్టత లేని డీఈవో
- సర్క్యులర్ అందిందన్న పలువురు ఎంఈవోలు

5



మిరుదొడ్డి మండలంలోని ప్రాథమిక పాఠశాలలో చిన్నారులకు నిరాశే

'మల్లన్న' సొమ్ము..

## దారి మళ్లింపు

- పారిశుధ్యం పేరిట రూ.10 లక్షలు మంజూరు
- కొమురవెల్లి గ్రామపంచాయతీకి నిధులు
- ట్రెజరీలో జమచేయకుండా మరో ఖాతాకు మళ్లింపు
- కూలీలు, బ్లీచింగ్ పౌడర్, చీపుర్ల పేరిట రికార్డులు
- వెల్లువెత్తుతున్న అనుమానాలు

19



కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయం




సిద్దిపేటలో ప్రారంభించిన పాదయాత్రకు ఘన స్వాగతం పలుకుతున్న కేవీపీఎస్ నాయకులు

5

## ఇసుక మాఫియాకు అడ్డుకట్ట వేయాలి

- నేరెళ్ల, కామారెడ్డి బాధితులకు న్యాయం చేయాలి
- సంఘటనలపై ముఖ్యమంత్రి స్పందించాలి
- సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలి
- టీ జేఏసీ చైర్మన్ ప్రొఫెసర్ కోదండరాం
- సిద్దిపేట నుంచి నేరెళ్లకు పాదయాత్ర ప్రారంభం
- హాజరైన తమ్మినేని, చాడ

దసరా అన్నారు..

## సంక్రాంతి వస్తున్నది

- డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం పూర్తయ్యేదెన్నడు ?
- రెండు గ్రామాల్లో భూమి కేటాయింపు చేయలేదు
- మిగతా చోట్ల నత్తనడకన పనులు
- ఉత్సాహం చూపని కాంట్రాక్టర్లు

4

బద్దిపడగలో నత్తనడకన సాగుతున్న డబుల్ బెడ్ రూం ఇండ్ల నిర్మాణ పనులు



## నల్లపోచమ్మ చెరువు ఇక క్షేమం

- 'ఆంధ్రజ్యోతి' కథనంతో స్పందించిన మంత్రి హరీశ్‌రావు, కలెక్టర్ వెంకట్రామారెడ్డి
- నిబంధనలకు విరుద్ధంగా పనులను చేపట్టిన వ్యక్తిపై కేసు

3

# మంజీరవం

సాహిత్య క్షేత్రంలో అక్షరాల సాగు చేస్తున్న మిత్రులందరి కోసం ఈ పేజీ. కవితలు, వ్యాసాలు, సమీక్షలు, సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన పెద్దలను ఈ తరానికి పరిచయం చేసే రచనలు, మీ అభిప్రాయాలు ajmanjeeravam@gmail.comకు పంపగలరు.



# కూనలమ్మ పదాల పూదోట సిద్దిపేట

## ఆరుద్ర స్ఫూర్తితో జిల్లాలో ఇద్దరు కవులు.. నాలుగు కూనలమ్మ పదాల పుస్తకాలు

**సిద్దిపేట :** తెలుగు సాహిత్యంలో పద్య, గద్య విభాగాలలో అనేక ప్రక్రియలున్నాయి. పద్య విభాగంలో ఛందోబద్ధ పద్యాలు, గేయ కవితలు, వచన కవితలు, పద కవితలు చెప్పుకోదగినవి. నాడు ఆరుద్ర ప్రారంభించిన కూనలమ్మ పదాలను కొనసాగించిన వారు చాలా తక్కువ. సిద్దిపేట జిల్లాలో ఐతా చంద్రయ్య, కటుకోజ్వల ఆనందంలు ఈ ప్రక్రియలో ప్రత్యేకతను చాటుకుంటూ రెండేసి పుస్తకాలు ప్రచురించారు.

కూనలమ్మ పదాల్లో నాలుగు పాదాలుంటాయి. మొదటి మూడు పాదాలలో పది మాత్రలు, నాల్గవపాదంలో 8 మాత్రలుంటాయి. మకుటం, అంత్యప్రాస గాని ఆది ప్రాసగాని ఉండాలి. అంత్య, ఆది ప్రాసలు కనీసం రెండు పాదాలలో ఉండాలి. ఈ ప్రక్రియలో తెలుగు సాహిత్యంలో 50లోపు పుస్తకాలు వెలువడ్డాయని అంచనా. అన్ని రకాల సాహిత్యాన్ని వడపోసిన సిద్దిపేట ప్రాంతంలో ఇద్దరు కవులు ఈ ప్రక్రియలో కూడా తమ ప్రావీణ్యాన్ని చాటి చెప్పారు. కవి, రచయిత, విమర్శకుడు, అనువాదకునిగా గుర్తింపు పొందిన ఐతా చంద్రయ్య 1990లోనే చందమామ పదాలు వెలువరించారు.




**ఎన్నికలలో పొత్తు**
**ఎన్నికలలో చిత్తు**
**రాజకీయం మత్తు**
**ఓ చందమామ**

అంటూ చందమామ పదాలలో నాటి రాజకీయ, సామాజిక నేపథ్యంలో అనేక పదాలున్నాయి. తెలంగాణ మలి ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసిన దశలో ఐతా చంద్రయ్య తెలంగాణ పదాలు వెలువరించారు.

**తెలంగాణమానాడు**
**వెలుగుజిమ్మెను చూడు**
**విశ్వవీధుల నిండు**
**ఓ తెలంగాణ**

అంటూ ఈ పదాలు వెలువరించారు. మలి తెలంగాణ ఉద్యమం ప్రారంభం నుంచి, ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటయేంత వరకు నేపథ్యంగా ఈ పదాలు హృద్యంగా ఆకట్టుకుంటాయి.



ఐతా చంద్రయ్య



కటుకోజ్వల ఆనందం




చిన్నకోడూరు మండలం చౌడారంకు చెందిన కటుకోజ్వల ఆనందం కూనలమ్మ పదాల నేపథ్యంలో రెండు పుస్తకాలు వెలువరించారు. ఈ రెండు భక్తి నేపథ్యంలో రచించినవే. శ్రీ అయ్యప్ప పదాల్లో

**మర్మములు విడనాడి**
**ఖర్మములు నెడబాపి**
**ధర్మమును బోధించు**

స్వామి అయ్యప్ప! అని కొనసాగుతాయి. సంతోషిమాత పదాలలో అమ్మవారి జన్మ వృత్తాంతాన్ని చాటిచెప్పారు.

పుస్తక పరిచయం




## విశ్వనాదాలు

**జీవితానుభవాల కవితా సంపుటి**

**హుస్నాబాద్, జనవరి 6:** నిత్య జీవితానుభవాలను చూపుతూ వాటిలోని మంచిని ఎంచుకునే విధంగా వెలువడిన కవితల సమాహారం 'విశ్వనాదాలు'. సందేశంతో పాటే సామాజిక చైతన్యాన్ని కలిగించే సంకలనమిది. హుస్నాబాద్ పట్టణానికి చెందిన కవి, రచయిత, రిటైర్డు ఆంగ్ల ఉపాధ్యాయుడు కామారపు విశ్వనాథం దీని కర్త. 'ఎండుటాకులు ఏరుకుతినే పశువుకు పచ్చిగడ్డి దొరికిన నాడే పండుగ'... 'సముద్రపు నీరెంత సమృద్ధిగా ఉంటేనేం త్రాగడానికి తగనిదైనప్పుడు' అంటూ జీవన స్థితిగతుల గురించి ప్రశ్నిస్తారాయన. విశ్వజీవన రాగాలు, అమృత వర్షిణి కవితా సంపుటాలు ఆయన ఇదివరకటి రచనలు.

**ప్రతులకు** : 17-103/1/1, టీచర్స్ కాలనీ, హుస్నాబాద్, జిల్లా : సిద్దిపేట

**రచయిత సెల్ :** 9849335230

కవిత్వం

## పొరం

అక్షరాల పల్లకి బోయీలం
కలిసి గాల్లో నడుస్తున్నపుడు
బొమ్మల నిచ్చెనలేసే పొత్తు
నమ్మకం తట్టలు మోసినంతకాలం
మనంగా మారిన బస్సు ప్రయాణం
చిటికెన వేలు పట్టుకున్న
మొలకల్నే చేర్చాం ఇంటికి
మనం వనం కాలేకపోయాం
హవ్వల్ దర్జాగా గెట్లు పెట్టుకోలే

నా అక్షరాలను తాకట్టు పెట్టావు
నమ్మకం గోవర్ధనగిరి ఎత్తిన ఫోజు
కాళ్లకింది భూమి తవ్వేశావు
నాటుకున్నావు నీ కాళ్ల కింద
మోసం ధృతరాష్ట్ర కౌగిట్లో నేను
పగోనింట్ల ఇస్తరాకువు
మోపావు తలపై పాదం
గాల్లో జుట్టు ఎగరేసిన సంబరానివి
గాల్లో వేలాడుతూ నేను
గాలిబుడగ కాను పగిలిపోవడానికి

నేను అక్షరాలు నాటేసేవాన్ని
కవిత్వం పంటలు తీసేవాన్ని
కొనగోటిపై ఆత్మవిశ్వాసం
జీవమున్న వాన్ని
జీవించడం నేర్పిన వాన్ని
తుంచేశాననుకున్నావు కసితో
తలెత్తుకున్నా ఆకాశానికి
నివ్వెరపోవడం నీ వంతు
నిలదొక్కుకోవడం నా వంతు

**– కొమురవెల్లి అంజయ్య**
(మిత్రశత్రువుకు ప్రేమతో)

# మట్టి ఆలాపనల సుజాత

- **సాహితీ కుటుంబంలో నుంచి వచ్చిన కుసుమం**
- **మూడు పుస్తకాల ప్రచురణ**

పరిచయం




**ఇవ్వాళ మట్టీ**
**కన్నీరు పెడుతుందా?**
**అవును!**
**మనుష్యుల కాలుష్యానికి**

**చంద్రుని మీంచి**
**తెచ్చిందేదో తెలుసా!**
**మణిమాణిక్యాలు కాదు**
**కేవలం మట్టి!**

**ఇన్ని తళతళల పట్నాన్ని వదిలి**
**ప్రతి ఉదయం నా మజిలీ స్వచ్ఛమైన పల్లెకు**
**హమ్మయ్య!**
**ఇప్పుడు హాయిగా ఊపిరాడుతుంది.**

నాంపల్లి సుజాత కవిత్వానికి ఇవి మచ్చుతునకలు. కోహెడ మండలం సముద్రాల పాఠశాలలో సోషల్ టీచర్‌గా పనిచేసే నాంపల్లి సుజాత సాహిత్య వాతావరణంలో పెరిగి కవయిత్రిగా రూపుదిద్దుకున్నది. తండ్రి అన్నవరం దశరథం ఉపాధ్యాయుడు, చిత్రకారుడు. అన్న అన్నవరం దేవేందర్ సాహితీ ప్రపంచంలో చిరపరిచితుడు, తమ్ముడు శ్రీనివాస్ చిత్రకారుడు. హుస్నాబాద్ మండలం పోతారంలో జన్మించిన ఆమె. నాంపల్లి రాములుతో వివాహానంతరం హైదరాబాద్‌కు మారినా, తిరిగి వృత్తిరీత్యా సిద్దిపేట జిల్లాకు మారక తప్పలేదు. ఉపాధ్యాయ వృత్తిలో ఉన్నా పల్లెటూరి మట్టి మనుషుల మధ్య ఉంటుండటంతో వారి జీవన విధానం, బాధలు, భావనలు కవిత్వంలో




చోటు చేసుకుంటాయి. ఆచార్య ఎన్.గోపి ప్రభావంతో నానీల ప్రక్రియను చేపట్టారామె. 2006లో నానీల సంపుటి 'నెమలీకలు', వెలువరించింది. అందులో ముఖ్యంగా ప్రపంచీకరణ ప్రభావంతో గ్రామీణ సంస్కృతి పతనమైపోతున్న దీనదృశ్యం, తారుమారవుతున్న విలువలు, నగరీకరణ ప్రభావం మొదలైనవి చోటు చేసుకున్నాయి. 2009లో 'మట్టి నా ఆలాపన' వచన కవితా సంపుటి వెలువరించారు. అందులో ఎర్రబస్సు, ఎనగర్ర, దస్తీ మొదలైనవన్నీ గ్రామీణ వాతావరణాన్ని ప్రతిబింబించేవే. 2015లో తిరిగి 'మట్టి నానీలు' అనే ఏక వస్తువుతో కవిత్వం వెలువరించింది. మానవ నాగరికతకే ఆనవాళ్లయిన మట్టి పాత్రలు నేడు గత స్మృతులుగా మారిపోతున్న తీరును అందులో వెల్లడించింది. ప్లాస్టిక్ ఆక్రమించిన తీరును ఆమె కళ్లకు కడ్తుంది.

**మంత్రహస్తమిది**
**ఎన్ని కుండలో అతని చుట్టూ**
**ఇంట్లో మాత్రం**
**చిల్లి కుండ!**

అంటూ సామాజిక చైతన్యాన్ని రంగరించి రచనలు చేస్తున్న సుజాత కలం నుంచి మరింత సాహిత్యం వెల్లివిరియాలని కోరుకుందాం.

**– సిద్దిపేట**

# సమాజ హితాన్ని కాంక్షించేదే సాహిత్యం

ఇంటర్వ్యూ

**డాక్టర్ చెప్పెల హరినాథశర్మ**

**సిద్దిపేట, జనవరి 6:** సమాజ హితాన్ని కాంక్షించేదే సాహిత్యమని సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు విభాగాధిపతి చెప్పెల హరినాథశర్మ చెప్పారు. శనివారం ఆంధ్రజ్యోతికిచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడారు. కవిత్వంలో వాసి కన్నా రాసి ముఖ్యమని అన్నారు.

**సాహిత్య ప్రయోజనం ఏమిటి?**

సమాజ హితాన్ని కాంక్షించడమే సాహిత్య ప్రయోజనం. దేశ, కాల పరిస్థితులకు అనుగుణంగా సాహిత్య సృజన జరగాలి. కవిత, కథ, నవల ఇలా ప్రక్రియ ఏదైనా విశాల సామాజిక ప్రయోజనాలకు అనుగుణంగా ఆవిర్భవించాలి. వెయ్యేళ్ళ తెలుగు సాహిత్యంలో ఇలాంటి రచనలే చరిత్రలో నిలిచాయి.

**సమకాలీన సాహిత్యం ప్రయోజనవంతంగా ఉందని భావిస్తున్నారా?**

సమాజంలోని విభిన్న వర్గాల ప్రయోజనాల పరిరక్షణ ధ్యేయంగా వచ్చిన సాహిత్యం ఉద్యమస్ఫూర్తితో రావడం ఆధునిక యుగలక్షణంగా చెప్పవచ్చు. స్త్రీవాద, దళితవాద, మైనారిటీ వాద, ప్రాంతీయ అస్థిత్వవాద, జాతీయ వాద ధోరణులు ఇందుకు ఉదాహరణలు. ఆధునిక ధోరణుల్లో తెలంగాణ అస్థిత్వవాద సాహిత్యం విశేష ప్రభావం చూపింది.

**పద్య, గేయ, వచన కవిత్వం.. వీటిలో ఏ ప్రక్రియ బలమైన ప్రభావాన్ని చూపిందంటారు?**



ప్రక్రియ ఏదైనా అభివ్యక్తీకరణ ఎలా ఉంది? కవిత్వం పాలు ఎంత అనేదే ముఖ్యం. ఛందోబద్ధమైనదంతా కవిత్వం కాకపోవచ్చు. అదేవిధంగా అంత్యప్రాసలతోనో అనుప్రాసలతోనో వాక్యాలను విరిచో, వచనాన్ని పరిచో అదే వచన కవిత్వమనే భ్రమ కూడా మంచిది కాదు. ఈనాడు అధ్యయన శీలత తగ్గుతోంది. పర్యవసానంగా కవితా సంకలనాలు విరివిగా వస్తున్నా.. రాశి తప్ప వాసి పెరగడం లేదన్న విమర్శలు వస్తున్నాయి.

# నల్లపోచమ్మ చెరువు ఇక క్షేమం

- ఆంధ్రజ్యోతి కథనానికి మంత్రి హరీశ్‌రావు, కలెక్టర్ వెంకట్రామారెడ్డి స్పందన
- చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో పనులపై సీరియస్
- కదలివచ్చిన ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు
- నిబంధనలకు విరుద్ధంగా పనులు చేపట్టిన వ్యక్తిపై కేసు
- వీఆర్వోపై చర్యలకు ఆదేశం


నల్లపోచమ్మ చెరువు పటాన్ని పరిశీలిస్తున్న ఐబీ ఈఈ రవీందర్‌రెడ్డి

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

**చేర్యాల, జనవరి 6:** మండలంలోని నాగపురి శివారులోని నల్లపోచమ్మ చెరువుకు ఇక భరోసా లభించింది. ఈ మేరకు రాష్ట్ర భారీనీటి పారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు, జిల్లా కలెక్టర్ వెంకట్రామారెడ్డి స్పందించారు. చెరువు పరిరక్షణకు కట్టుదిట్టమైన 'చర్యలు' తీసుకున్నారు. కొండపోచమ్మ, నల్లపోచమ్మ ఆలయాలకు చేరువలోనున్న నల్లపోచమ్మ చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో అక్రమ వెంచర్ కోసం నిబంధనలకు విరుద్ధంగా మట్టి, మొరం పోసి చదును చేస్తున్న విషయమై శనివారం 'ఆంధ్రజ్యోతి'లో 'నల్లపోచమ్మ చెరువును మింగేస్తున్నారు' శీర్షికన ప్రచురితమైన కథనానికి వారు స్పందించారు. ఈ విషయమై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ వెంటనే విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీంతో నీటి పారుదల శాఖ ఈఈ రవీందర్‌రెడ్డి, డీఈ స్వామిదాసు, చేర్యాల తహసీల్దార్ అరుణ, సర్వేయర్ మహేందర్, ఆర్ఐ రంజిత్, సిబ్బంది శనివారం ఉదయం నల్లపోచమ్మ చెరువును సందర్శించారు. చెరువు తూము, మత్తడి, ఎఫ్‌టీఎల్‌ను పరిశీలించారు. ఎఫ్‌టీఎల్ పరిధిలో అక్రమంగా మట్టి, మొరం పోయడాన్ని నిర్ధరించి సదరు వ్యక్తిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయమై వీఆర్వో కొండల్‌రెడ్డిపై చర్యలకు ఆదేశాలిచ్చి, ఆక్రమణకు పాల్పడిన బాలకృష్ణారెడ్డిపై చర్యల నిమిత్తం కొమురవెల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. అలాగే ఐబీ శాఖ సిబ్బందిపై శాఖాపరమైన చర్యలకు నిర్ణయం తీసుకున్నారు. చెరువు శిఖంతో పాటు భూములు అన్యాక్రాంతానికి గురవుతున్నాయని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ స్థానికులు ఐబీ ఈఈతో పాటు తహసీల్దార్ అరుణను కోరారు. ఐబీ ఈఈ రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ ఏకసాల్ పట్టాభూమిలో పంటలు పండించుకోకుండా ఎత్తులో మట్టి, మొరం నింపడం చట్టపరంగా నేరమని, మత్తడి లోపలే ఈతతంగం కొనసాగడాన్ని నిర్ధరించామన్నారు. సోమవారంలోగా సర్వేపూర్తి చేసి చెరువు ఎఫ్‌టీఎల్ హద్దులు నిర్ధారిస్తామన్నారు. బాలకృష్ణారెడ్డి అక్రమంగా పోసిన మట్టిని తొలగించాలని ఆదేశించామని, ఒకవేళ ఆయన తొలగించకపోతే తామే తొలగిస్తామన్నారు. 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్థానికులు, ఆయకట్టు రైతులు అభినందనలు తెలిపారు. మంత్రి హరీశ్‌రావు, జిల్లా కలెక్టర్ వెంకట్రామారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

## రోడ్డుప్రమాదంలో జనగామ జిల్లావాసి దుర్మరణం

**చేర్యాల, జనవరి 6:** చేర్యాల మండలకేంద్రం శివారు బండపల్లి క్రాస్‌రోడ్డు సమీపంలో శనివారం చోటుచేసుకున్న రోడ్డుప్రమాదంలో జనగామ జిల్లావాసి దుర్మరణం చెందగా, మరో వ్యక్తి తీవ్ర గాయాలపాలయ్యాడు. స్థానికుల కథనం ప్రకారం... జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం లింగంపల్లి గ్రామానికి చెందిన బండి రాములు(31), పుట్ట రమేశ్‌లు బైక్‌పై చేర్యాలకు వస్తున్నారు. ఈ క్రమంలో చేర్యాల నుంచి చుంచనకోట వైపునకు వెళుతున్న ట్రాక్టర్ బండపల్లి శివారు కాలనీ క్రాస్‌రోడ్డు సమీపంలో వీరి బైక్‌ను ఢీకొనడటంతో రాములు అక్కడికక్కడే మృతిచెందాడు. తలకు తీవ్రగాయమై మెదడు లోపలి మాంసం బయటకు వచ్చింది. పుట్ట రమేశ్‌కు తీవ్రగాయాలవడంతో స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. విషయం తెలిసిన రాములు కుటుంబసభ్యులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని చూసి కన్నీరుమున్నీరయ్యారు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ చేపట్టారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు. ఘటనకు కారణమైన ట్రాక్టర్‌డ్రైవర్ పరారీలో ఉన్నాడు.

## రోడ్డుప్రమాదంలో ముగ్గురికి గాయాలు



ప్రమాదంలో గాయపడినవారు

**కొండపాక, జనవరి 6:** మండలంలోని తిమ్మారెడ్డిపల్లి వద్ద శనివారం జరిగిన రోడ్డుప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి కరీంనగర్ జిల్లా సుల్తానాబాద్‌కు చెందినవారు కారులో హైదరాబాద్‌కు వెళ్తుండగా తిమ్మారెడ్డిపల్లి వద్ద ఎదురుగా వచ్చిన కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో సుల్తానాబాద్‌కు చెందిన కొమరవెల్లి అంజయ్య, సుజాత, కారు డ్రైవర్ రాజుకు గాయాలయ్యాయి. వీరికి 108 సిబ్బంది రాజిరెడ్డి ప్రథమ చికిత్స చేసి, సిద్దిపేట ఆసుపత్రికి తరలించారు.

## కారు బోల్తా తప్పిన ప్రమాదం

**కొండపాక, జనవరి 6:** స్థానిక ఎంపీడీవో కార్యాలయం సమీపంలో శనివారం జరిగిన రోడ్డుప్రమాదంలో కార్ బోల్తా పడింది. ఈ రోడ్డుపై సుమారు సంవత్సర కాలంగా వంతెన నిర్మాణ పనులు జరుగుతున్నాయి. కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో పనులు నత్తనడకన సాగుతుండడంతో వాహనాలు తరుచూ ప్రమాదాలకు గురవుతున్నాయి. శనివారం కారు అదుపుతప్పి బోల్తాపడింది. కారులైను బెలూన్లు ఓపెన్ కావడంతో డ్రైవర్ దేవయ్యకు ప్రమాదం తప్పింది. వంతెన నిర్మాణ పనుల వల్లే ప్రమాదం జరిగిందని గ్రామస్థులు వాపోయారు.

## విద్యార్థుల సమస్యలపై నిరంతర పోరాటం

- ఫీజులు పెంచితే ఉద్యమం తప్పదు
- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోట రమేశ్

**సిద్దిపేట అర్బన్, జనవరి 6:** విద్యారంగ సమస్యలపై ఎస్ఎఫ్ఐ సమరశీల పోరాటాలు నిర్వహిస్తుందని, ఈ విద్యాసంవత్సరంలో ఫీజులు పెంచితే పోరాటం తప్పదని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోట రమేష్ అన్నారు. ఎస్ఎఫ్ఐ సిద్దిపేట జిల్లా ద్వితీయ మహాసభలకు శనివారం హాజరైన ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ విద్యాసంస్థల అక్రమ ఫీజులపై ఉద్యమిస్తామన్నారు. పెండింగ్‌లో ఉన్న రూ.1700 వందల కోట్ల స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ని విడుదల చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందన్నారు. కేజీ నుంచి పీజీ వరకు ఉచిత నిర్బంధ విద్య అని చెప్పి దాదాపు 4 సంవత్సరలు గడుస్తున్నా ఇంతవరకు అమలుకు నోచుకోవట్లేదన్నారు. సంక్షేమ హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించడంలో ప్రభుత్వం చిన్నచూపు చూస్తుందని రమేశ్ ఆరోపించారు. కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలకు వత్తాసు పలుకుతుందని విమర్శించారు. భవిష్యత్లో దేశవ్యాప్తంగా విద్యార్థులను ఏకం చేసి మరిన్ని పోరాటాలు చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ మహాసభల్లో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తాటికొండ రవి జిల్లా అధ్యక్షుడు దాసరి ప్రశాంత్, నాయకులు మధు, అశోక్, రమేష్ ,రాజు, భరత్ తదితరులు పాల్గొన్నారు.



జిల్లా మహాసభలో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి రమేష్

## నల్ల బెల్లం స్వాధీనం : ఒకరి అరెస్టు

**సిద్దిపేట కల్చరల్, జనవరి 6:** అక్రమంగా నల్ల బెల్లం విక్రయిస్తున్నాడన్న సమాచారంతో సిద్దిపేట ఎక్సైజ్ అధికారులు దాడి చేసి ఒకరిని అదుపులోకి తీసుకున్న సంఘటన శనివారం సిద్దిపేటలో జరిగింది. ఎక్సైజ్ సీఐ చాణిక్య కథనం ప్రకారం.. సిద్దిపేట పట్టణంలోని శరభేశ్వరాలయానికి సంబంధించిన దుకాణం నంబర్ 19లో అరిసెపల్లి హరికిషన్ అనే బెల్లం వ్యాపారి అక్రమంగా బెల్లం నిల్వ ఉంచి ఇతర జిల్లాలకు నాటుసారా తయారీకి విక్రయిస్తున్నాడన్నారు. సమాచారం అందడంతో సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించగా 59.16 క్వింటాళ్ల నల్ల బెల్లాన్ని స్వాధీనం చేసుకుని సదరు వ్యాపారిని అరెస్టు చేసినట్లు తెలిపారు. ఎవరైనా అక్రమంగా నల్ల బెల్లం విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఈ దాడుల్లో ఎస్ఐ నర్సింలు, సిబ్బంది సత్యనారాయణ, జావన్, అనిల్, గోపాల్, స్వామి, టూటౌన్ ఎస్ఐ సాంబయ్యగౌడ్ పాల్గొన్నారు.

## కుక్కల దాడిలో 25 గొర్రెలు మృతి

- నర్సాపూర్ గ్రామంలో ఘటన
- రూ.లక్ష మేర నష్టం
- పంచనామా నిర్వహించిన ఆర్ఐ నజియా

**ములుగు, జనవరి 6:** కుక్కల దాడిలో గొర్రెలు మృతిచెందిన సంఘటన ములుగు మండలం నర్సాపూర్ గ్రామంలో శుక్రవారం రాత్రి జరిగింది. గ్రామానికి చెందిన పూడరి మల్లయ్య రోజుమాదిరిగానే శుక్రవారం తన గొర్రెలను మేపుకొచ్చి కొట్టంలోకి తోలాడు. శనివారం తెల్లవారుజామున చూసేసరికి గొర్రెల మందపై వీధి కుక్కల దాడి చేయడంతో 25 గొర్రెలు మృతి చెందినట్లు గుర్తించారు. ప్రభుత్వం అందించిన సబ్సిడీ గొర్రెలతో కలిపి మొత్తం 29 గొర్రెలు ఉండగా 25 మృతిచెందాయని, మిగిలిన నాలుగు ప్రాణాపాయ స్థితిలో ఉన్నాయని మల్లయ్య విలపిస్తూ చెప్పాడు. లక్ష రూపాయల వరకు నష్టం వాటిల్లిందని ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు. ఈ విషయం తెలుసుకున్న సర్పంచ్ మల్లేశ్‌యాదవ్, టీఆర్ఎస్ నాయకులు రాజేందర్‌రెడ్డి, ఏనుగు బాపురెడ్డి, నర్సింహారెడ్డి మల్లయ్యను పరామర్శించారు. ఆర్ఐ నజియా సంఘటన స్థలానికి చేరుకొని పంచనామా చేశారు. మిగతా గొర్రెలకు పశువైద్యాధికారి రాజేందర్‌రెడ్డి టీకాలు వేశారు.


మృతిచెందిన గొర్రెల వద్ద బాధితుడు మల్లయ్య

## ఎస్ఐ ప్రభాకర్‌రెడ్డి కుటుంబాన్ని ఆదుకుంటాం : సీపీ

**సిద్దిపేట క్రైం,జనవరి 6:** గతంలో ఆత్మహత్య చేసుకున్న కుకునూరుపల్లి ఎస్ఐ ప్రభాకర్‌రెడ్డి కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని సిద్దిపేట పోలీస్ కమిషనర్ శివకుమార్ అన్నారు. శనివారం తన కార్యాలయానికి ఎస్ఐ ప్రభాకర్‌రెడ్డి భార్య రచన, కుటుంబ సభ్యులను పిలిపించి మాట్లాడారు. ప్రభాకర్‌రెడ్డి భార్య ఉద్యోగం గురించి కలెక్టర్‌కు నివేదిక పంపినట్లు తెలిపారు. త్వరలో ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తామని సీపీ హామీ ఇచ్చారు. ఏ సమస్య వచ్చినా నేరుగా వచ్చి తనను కలవాలని ప్రభాకర్‌రెడ్డి బంధువులకు సూచించారు. ప్రభాకర్‌రెడ్డికి ప్రభుత్వపరంగా అందవల్సిన గ్రూప్ ఇన్స్యూరెన్సు, లీవ్ ఎన్ క్యాష్‌మెంట్, ఇతర అలవెన్స్‌లు మొత్తం కలిపి రూ.11 లక్షలు, గతంలో రూ.3 లక్షల చెక్కును అతని భార్యకు అందజేశామన్నారు. శనివారం రూ.8 లక్షల చెక్కును ప్రభాకర్‌రెడ్డి భార్య రచనకు సీపీ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏజీ ఈశ్వర్, సూపరింటెండెంట్ రామ, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.


ప్రభాకర్‌రెడ్డి భార్యకు చెక్కును అందజేస్తున్న సీపీ శివకుమార్

## 'నేరస్తులపై సమగ్ర సర్వే చేపట్టాలి'



**సిద్దిపేట క్రైం, జనవరి 6:** కమిషనరేట్ పరిధిలోని నేరస్తులపై సమగ్ర సర్వే చేసి వివరాలను ఈ నెల 15 వరకు కమిషనరేట్‌కు పంపాలని పోలీసు అధికారులకు సూచించారు. శనివారం కమిషనరేట్ పరిధిలోని పోలీసు అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి మాట్లాడారు. టీఎస్‌కప్ మొబైల్ యాప్ సంబంధించిన వివరాలు పంపాలని తెలిపారు. పోలీసు కార్యాలయాల్లో నిర్వహణకైన బడ్జెట్ వివరాలను కమిషనరేట్‌కు పంపాలని సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీలు, ఏసీపీ, ఏజీ ఉన్నారు.

### ధ్రువీకరణ పత్రాల అందజేతలో
## అర్చకులకు ఇబ్బందులు

**కొమురవెల్లి రూరల్, జనవరి6:** ప్రతీరోజు ఆలయాల్లో పూజలు నిర్వహిస్తున్నట్లు మూన్నెల్లకొకసారి ధ్రువీకరణ పత్రాలను అందజేయాలని కొద్దిరోజుల కిందట దేవాదాయ ధర్మాదాయశాఖ ఉన్నతాధికారుల నుంచి అర్చకులకు నోటీసులందాయి. సిద్దిపేట జిల్లాలో మొత్తం 127 ఆలయాలకు ధూపదీప నైవేద్యం పథకం అమలవుతోంది. ఇందుకుగానూ ఆ ఆలయంలో పూజచేసే అర్చకులకు నెలకు ఆరువేల రూపాయల చొప్పున గౌరవవేతనం అందుతోంది. గతంలో కొన్ని చోట్ల ఈ వేతనం చెల్లింపులలో జరిగిన దుర్వినియోగాన్ని, పొరపాట్లను దృష్టిలో ఉంచుకొని సంబంధిత అధికారులు గ్రామ కార్యదర్శి, లేదా రెవెన్యూ అధికారి ధృవీకరించిన పత్రాన్ని అందజేయాలని నిబంధన విధించారు. జిల్లాల పునర్విభజన కంటె ముందు వరంగల్ జిల్లాకు చెందిన మద్దూరు, చేర్యాల, కొమురవెల్లి మండలాలకు చెందిన అర్చకులు సమీపంలోని ప్రస్తుత జనగామ జిల్లా కొడువటూరు ఆలయాధికారి కార్యాలయంలో ఈ పత్రాలను అందజేసేవారు. ప్రస్తుతం ఈ మూడు మండలాలు సిద్దిపేట జిల్లాలో కలిసాయి. దీంతో నోటీసులు అందుకున్న అర్చకులు సుమారు 200 కిలోమీటర్ల దూరంలోని ఉమ్మడి మెదక్ జిల్లా ప్రధాన కేంద్రమైన సంగారెడ్డి అసిస్టెంట్ కమిషనర్ కార్యాలయంలో సమర్పించడం కష్టసాధ్యంగా మారింది. ఈ విషయమై 'ఆంధ్రజ్యోతి' సంబంధిత అధికారులను సంప్రదించింది.

### పోస్టు ద్వారా పంపిస్తే చాలు

అర్చకులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. గతంలో జరిగిన అనుభవాల దృష్ట్యా, అర్చకులు పూజ నిర్వహిస్తున్నారా? లేదా? అన్న విషయాన్ని తెలుసుకోవడానికి ఈ పత్రాలను అడుగుతున్నాం. గ్రామ కార్యదర్శి లేదా సంబంధిత రెవెన్యూ అధికారి చేత ధృవీకరింపబడిన పత్రాన్ని ప్రతి మూడు నెలలకొకసారి సహాయ కమిషనర్, దేవాదాయ ధర్మాదాయ శాఖ, విద్యానగర్, పోతిరెడ్డిపల్లి, సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాలకు జనరల్ పోస్టు చేస్తే సరిపోతుంది. ఒక జిరాక్స్ కాపీని తమతో ఉంచుకోవడం మరిచిపోవద్దు.

**–కృష్ణప్రసాద్,**
**అసిస్టెంట్ కమిషనర్,**
**ఉమ్మడి మెదక్ జిల్లా**

# నత్తనడకన 'డబుల్' నిర్మాణ పనులు

- **భూములు లేక ఆగిన నిర్మాణాలు**
- **ఉత్సాహం చూపని కాంట్రాక్టర్లు**
- **దసరా అన్నారు... సంక్రాంతి అయినా కష్టమే**
- **త్వరితగతిన పూర్తి చేయాలని లబ్ధిదారుల వినతి**



**బద్దిపడగలో క్యూరింగ్ లేక ఎండిపోయిన గోడలు**

**నంగునూరు, జనవరి 6 :** ప్రభుత్వం చేపడుతున్న డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణాలు నత్తనడకన సాగుతున్నాయి. మండలంలోని 12 గ్రామాలకు డబుల్ బెడ్ రూం ఇళ్లు మంజూరు కాగా, కేవలం మూడు గ్రామాల్లోనే పనులు నడుస్తున్నాయి. అధికారుల పర్యవేక్షణ లేకపోవడం వల్ల కాంట్రాక్టర్లు ఇష్టానుసారంగా పనులు చేస్తున్నారని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. మండలంలోని నంగునూరు, పాలమాకుల, కోనాయిపల్లి, అక్కెనపల్లి, కొండంరాజుపల్లి, ముండ్రాయి. సిద్ధన్నపేట, నాగరాజుపల్లి, మైసంపల్లి, గట్లమల్యాల, వెల్కటూరు, బద్దిపడగ గ్రామాల్లో మొత్తం 433 డబుల్ బెడ్ రూం ఇళ్లు మంజూరయ్యాయి. ఒక్కొక్క ఇంటి నిర్మాణం కోసం రూ.6.29 లక్షలు మంజూరయ్యాయి. మండలంలోని నంగునూరు, వెల్కటూరు, బద్దిపడగ, ముండ్రాయి గ్రామాల్లో మినహా ఎక్కడ పనులు జరగడం లేదు. ఊరి దగ్గర భూమి లేక పోవడంతో కొన్ని గ్రామాల్లో ఇంతవరకు పనులు చేపట్టలేదు. మరికొన్ని గ్రామాల్లో భూమి పూజ చేసి వదిలేశారు. సిద్ధన్నపేట, అక్కెనపల్లి గ్రామాల్లో భూములు దొరకకపోవడంతో అక్కడ ఇళ్ల నిర్మాణం ఊసేలేదు. జరుగుతున్న పనులు లోపభూయిష్టంగా చేపడుతున్నట్లు విమర్శలు వస్తున్నాయి. వెల్కటూరులో గత దసరాకి ప్రారంభిస్తామని పాలకులు హామీ కూడా ఇచ్చారు. సంక్రాంతి అయినా పూర్తి కావడం లేదు. డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణం కోసం కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదని అధికారులు చెబుతున్నారు.

**ఇళ్లకు స్థలాలు లేవట**

మండలంలోని సిద్ధన్నపేట, అక్కెనపల్లి గ్రామాల్లో డబుల్ బెడ్ రూం ఇళ్ల కోసం భూములు ఇచ్చేందుకు ఎవరు ముందుకు రావడం లేదు. దాంతో అక్కడ మంజూరైన ఇళ్లకు మోక్షం ఎప్పుడు అని లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారు.

**నత్తనడకన కొనసాగుతున్న పనులు**

మండలంలోని వెల్కటూరు, నంగునూరు, ముండ్రాయి, బద్దిపడగ గ్రామాల్లో పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. ఇక్కడ చేపట్టిన పనులకు అధికారులే ఇసుకను దగ్గరుండి పోయించారు. అయినా గిట్టుబాటు కావడంలేదని కాంట్రాక్టర్లు ఇష్టానుసారంగా పనులు చేపడుతున్నారు.

రోడ్డు పక్కన నిర్మించినప్పటికీ రోడ్డు కంటే కిందకు నిర్మించడం వల్ల వర్షాలు వచ్చినపుడు ఇళ్లలోకి నీరు చేరే ప్రమాదం ఉంది. అలాగే పిల్లర్లు పోసేముందు ప్రతి బీము కింద రాళ్లకు బదులు సిమెంట్ ఇటుకలు వాడుతున్నారు. దీంతో ఇళ్లు తొందరగా పాడవుతాయని లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతంలో ఉండే ఇళ్లకు కలప కిటీకిలకు బదులు ఇనుప వాటిని పెట్టడం వల్ల ఏం ప్రయోజనం గ్రామస్థులు వాపోతున్నారు. కాంట్రాక్టర్లు చేస్తున్న పనుల్లో నాణ్యత ఏమాత్రం పాటించడంలేదని పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో పనులు మందకొడిగా సాగుతున్నాయని ఆరోపణలు వస్తున్నాయి.

**దసరాకు అన్నారు..**

**సంక్రాంతి కూడా వస్తుంది**

వెల్కటూరు, నంగునూరు గ్రామాల్లో నిర్మిస్తున్న డబుల్ బెడ్ రూం ఇళ్లు దసరాకి ఇస్తామన్నారు. కానీ సంక్రాంతి పండుగకు కూడా ఇచ్చే పరిస్థితి కానరావడంలేదు.

**కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు**

డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణానికి కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదని పంచాయతీ రాజ్ ఏఈ శశాంక్ తెలిపారు. ప్రభుత్వం ఇచ్చే 6.29 లక్షల రూపాయలతో ఇళ్ల నిర్మాణ పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్లు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు.

రోడ్డుకు కింది భాగంలో ఉన్న ఇళ్లకు మురుగు కాలువలు నిర్మిస్తారు కావున వాన నీరు ఇళ్లలోకి రాదన్నారు. ప్రతి బీము కింద సిమెంట్ ఇటుకలతో కట్టడంతో పాటు, కిటికీల ఏర్పాటు స్టేట్ పాలసీ అని చెప్పుకొచ్చారు. డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణంలో నాణ్యత ప్రమాణాల విషయంలో ఎక్కడ నిర్లక్ష్యం లేదన్నారు. తమ దృష్టికి తీసుకువస్తే కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకుంటామన్నారు.

**త్వరగా పూర్తి చేయాలని వినతి**

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలని ఆయా గ్రామాల లబ్ధిదారులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

# గజ్వేల్ ఆస్పత్రికి డయాలసిస్ సెంటర్

- **మొదటి విడతగా రోజుకు 16 మందికి చికిత్స**
- **ఐసీయూ, ట్రామా కేర్ సెంటర్ల ఏర్పాటుకు యోచన**
- **త్వరలోనే ప్రారంభానికి చర్యలు**



**గజ్వేల్‌లో నిర్మించిన 100 పడకల ఆసుపత్రి**

**గజ్వేల్, జనవరి 6:** ప్రభుత్వం మూత్రపిండాల వ్యాధితో బాధపడే రోగులకు శుభవార్త వినిపించనున్నది. సీఎం కేసీఆర్ గజ్వేల్ ఎమ్మెల్యేగా గెలుపొందిన అనంతరం మొట్టమొదటగా గజ్వేల్ ఆసుపత్రి రూపురేఖలు మార్చిన విషయం తెలిసిందే. హైరిస్క్ కేంద్రం ఏర్పాటు తో నెలకు 300నుంచి 400 ప్రసవాలు జరుగుతుండగా తాజాగా డయాలసిస్ కేంద్రం ఏర్పాటుకు ముందుకు వచ్చింది. రాష్ట్ర వ్యాప్తంగా 39 డయాలసిస్ సెంటర్ల ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అందులో మొదటి డయాలసిస్ సెంటర్‌ను మంత్రి హరీశ్‌రావు కృషితో సిద్దిపేట జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేయగా, రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటికే 13 సెంటర్లను వ్యాధిగ్రస్తులకు అందుబాటులోకి తీసుకువచ్చింది. ఇక గజ్వేల్‌లోను నూతనంగా నిర్మించిన 100 పడకల ఆసుపత్రిలో ఈ డయాలసిస్ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నారు. డయాలసిస్ కేంద్రంతో పాటు ఐసీయూ, ట్రామాకేర్ సెంటర్‌ను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తుండగా ఇప్పటికే అధికారులు ప్రతిపాదనలు రాష్ట్ర ప్రభుత్వానికి పంపించారు.

**పాత డిగ్రీ కళాశాల భవనంలో ఏర్పాటు**

నూతనంగా నిర్మించిన 100 పడకల ఆసుపత్రి వెనుక భాగంలో గల పాత డిగ్రీ కళాశాల భవనంలో డయాలసిస్ కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు అధికారులు ప్రతిపాదనలను సిద్ధం చేస్తున్నారు. నూతనంగా ఏర్పాటు చెసే ఈ కేంద్రంలో 5పడకలతో మొదటగా రోజుకు 16 మంది రోగులకు వైద్యం అందించనున్నారు. అనంతరం రోగుల సంఖ్యను బట్టి స్థాయిని పెంచనున్నారు. రోజుకు 5వేలు పెట్టి డయాలసిస్ చికిత్స తీసుకుంటున్న రోగులకు ఈ డయాలసిస్ కేంద్రం ఏర్పాటుతో ఊరట లభించనుంది.

**ఐసీయూ, ట్రామా సెంటర్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు**

డయాలసిస్ సెంటర్‌తో పాటు 5 పడకల ఐసీయూ, 5 పడకల ట్రామా కేర్ సెంటర్‌ను ఏర్పాటు చెయ్యడానికి అధికారులు ప్రతిపాదనలను సిద్ధం చేసి రాష్ట్ర ప్రభుత్వానికి పంపించారు. రాజీవ్ రహదారిపై జరిగే ప్రమాదాల్లో క్షతగాత్రులకు ట్రామా సెంటర్ కావాలని ఈ ప్రాంతం ప్రజలు ఎన్నో రోజులుగా ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ప్రమాదాలు జరిగిన సమయంలో ఇబ్బందులు ఎదురవుతున్న నేపథ్యంలో అత్యవసర పరిస్థితులలో ఐసీయూతో పాటు ట్రామా సెంటర్ల ఏర్పాటు ఎంతగానో ఉపయోగపడునున్నది. కాగా ఈ రెండూ ఏర్పడితే వైద్యరంగంలో గజ్వేల్ మరింత ముందుకు వెళ్తుందనేది కాదనలేని సత్యం.

## రంగనాయక సాగర్‌ను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలి

- **కలెక్టర్ వెంకట్రామారెడ్డి ఆదేశాలు**



**సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకట్రామారెడ్డి**

**సిద్దిపేట, జనవరి 6 :** రంగానాయక సాగర్‌ను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని కలెక్టర్ వెంకట్రామారెడ్డి కోరారు. సిద్దిపేటలోని మినీ ట్యాంకుబండ్, కోమటిచెరువు వద్ద శిల్పారామాన్ని కూడా పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు పక్కా ప్రణాళికలు చేపట్టాలన్నారు. ఈ అంశంపై సిద్దిపేట కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో శనివారం జేసీ పద్మాకర్, డీఆర్వో చంద్రశేఖర్, భూసేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వసంత కుమారి, ఇరిగేషన్ ఈఈ ఆనంద్, అర్బన్ ప్లానింగ్ కన్సల్టెంట్ శ్రీనివాస్‌తో సుదీర్ఘంగా సమీక్షించారు. మినీ ట్యాంకుబండ్ వద్ద శిల్పారామం ఏర్పాటు చేసి టూరిజం స్పాట్‌గా మార్చేందుకు కావాల్సిన మాస్టర్ కాన్సెప్ట్ ప్లాన్ 15 రోజుల్లో సిద్ధం చేయాలని అర్బన్ ప్లానింగ్ కన్సల్టెంట్ శ్రీనివాస్‌ను ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లాలోని జలాశయాల వద్ద టూరిజం స్పాట్ చేపట్టే అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ప్రధానంగా రంగనాయక సాగర్‌పై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వీకెండ్ స్పాట్‌గా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు రూపొందించాలని సూచనలు చేశారు. అలాగే దేశంలోనే ఎక్కడా లేని విధంగా జిల్లాలో రిజర్వాయర్ల నిర్మాణం చేపడుతున్న దృష్ట్యా పర్యాటక కేంద్రాలు నిర్మాణాలు చేపట్టాల్సిన చోట వాటికి సంబంధించిన ప్రతిపాదనలు రూపొందించాలని డీఆర్వో చంద్రశేఖర్, ఇరిగేషన్, ఇతర అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, సిద్దిపేట తహసీల్దారు ఉన్నారు.

## మున్సిపల్ అనుమతి లేకుండా ఇళ్లు నిర్మించొద్దు

**సిద్దిపేట, జనవరి 6:** మున్సిపల్ అనుమతి లేకుండా ఇళ్లను నిర్మించొద్దని కలెక్టర్ వెంకట్రామారెడ్డి ఆదేశించారు. స్పెషల్ గ్రేడ్ మున్సిపాలిటీ సిద్దిపేట కొత్త పట్టణ పరిధిలోని 27వ వార్డు కాళ్లకుంట కాలనీని శనివారం సాయంత్రం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ప్రభుత్వ పథకాలు కాలనీలోని ప్రజలకు క్షేత్రస్థాయిలో చేరేలా సమగ్ర సర్వే చేపట్టాలని జిల్లా పంచాయతీ అధికారి సురేశ్ బాబు, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డిలను ఆదేశించారు. పాత లేఅవుట్ మ్యాపుల విషయంపై సిద్దిపేట తహసీల్దారు పరమేశ్వర్‌ను ఆరా తీశారు. పాత లేఅవుట్ల ప్రకారం ఫార్మాట్ తయారు చేసి నివేదిక రూపొందించాలని మున్సిపల్ కమిషనర్, టౌన్ ప్లానింగ్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. ప్రధానంగా మున్సిపాలిటీ అనుమతి లేకుండా ఇళ్ల నిర్మాణం చేపట్టకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటికే నిర్మించిన, కొనుగోలు చేసిన ఇళ్లకు అనుమతి పొందేలా సిద్దిపేట మున్సిపాలిటీని సంప్రదించాలని ప్రజలకు సూచించారు. మున్సిపాలిటీ అనుమతి పొందిన తర్వాత ఇళ్ల నిర్మాణాలు చేసుకునేలా పర్యవేక్షణ చేయాలని టౌన్ ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జేసీ పద్మాకర్, ఇరిగేషన్ ఈఈ రవీందర్ రెడ్డి, మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు, ఎంపీడీవో సమ్మిరెడ్డి, ఏపీవో నర్సింగ్‌రావు, ఇతర శాఖల అధికారులున్నారు.

# నేడు ముత్యాల ముగ్గుల పోటీలు

- ఆంధ్రజ్యోతి–ఏబీఎన్ ఆధ్వర్యంలో గజ్వేల్‌లో రంగవల్లుల
- హాజరుకానున్న ఎంపీ ప్రభాకర్‌రెడ్డి, సినీతారలు
- మల్లారెడ్డి గార్డెన్స్‌లో 10 గంటలకు ప్రారంభం

**గజ్వేల్, జనవరి 6 :** చక్కని చుక్కల ముగ్గులకు వేళ అయింది. సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని 'ఆంధ్రజ్యోతి – ఏబీఎన్' ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న టాటా జెమినీ టీ ముత్యాల ముగ్గు పోటీలు...... టేస్ట్ పార్టనర్‌గా గోల్డ్ డ్రాఫ్, ఫ్యాషన్ పార్టనర్‌గా డిగ్‌సెల్, హెల్త్ పార్టనర్‌గా అమృతబిందు వేడుకల్లో పాలుపంచుకునేందుకు మహిళా మణులు అధిక సంఖ్యలో సంసిద్ధులయ్యారు. ఆదివారం ఉదయం గజ్వేల్ – ప్రజ్ఞాపూర్ నగర పంచాయతీ పరిధిలోని యాదగిరి థియేటర్ పక్కన ఉన్న మల్లారెడ్డి ఫంక్షన్‌హాల్‌లో రంగవల్లుల పోటీలు జరుగనున్నాయి. ఈ వేడుకలకు స్థానిక స్పాన్సర్లుగా గజ్వేల్ – ప్రజ్ఞాపూర్ నగర పంచాయతీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్ మొదటి విజేతకు బహుమతి రూ.5 వేలు అందిస్తుండగా, రెండో బహుమతి రత్నశ్రీ భారత్ గ్యాస్ ఏజెన్సీ (జగదేవ్‌పూర్) నిర్వాహకుడు సంజయ్‌గుప్త, మూడో బహుమతి ఐలయ్య యాదవ్ (బైలంపూర్)లు అందించనున్నారు. ఈ వేడుకులకు మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా, తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు పతాని రామకృష్ణాగౌడ్ ప్రత్యేక ఆహ్వానితులుగా, తెలంగాణ మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ అధ్యక్షురాలు, సీనియర్ నటి కవిత విశిష్ట అతిథిగా, ప్రముఖ యాంకర్ లావణ్య, యువ హీరోయిన్ స్రవంతిలు హాజరు కానున్నారు. ఉదయం 10 గంటలకు పోటీలు ప్రారంభం కానున్నాయి. ఈ పోటీల్లో పాటించాల్సిన నియమ నిబంధనలు :



సీనియర్ నటి కవిత, హీరోయిన్ స్రవంతి, యాంకర్ లావణ్య

- ❖ మహిళలు మాత్రమే పాల్గొనాలి.
- ❖ చుక్కల ముగ్గులను మాత్రమే వేయాలి.
- ❖ ఎన్నిచుక్కలు, ఎన్ని వరుసలు అనేవీ చెప్పగలగాలి.
- ❖ ముగ్గులు, రంగులు, పూలు ఇతర సామగ్రిని ఎవరికి వారే తెచ్చుకోవాలి.
- ❖ ముగ్గు ఐడియా, డిజైన్‌కు 5 మార్కులు, ముగ్గుకు 15 మార్కులు. మొత్తం 20 మార్కులు ఉంటాయి.
- ❖ ముగ్గును వస్తువులతో కాకుండా చేతితోనే వేయాలి.
- ❖ ముగ్గులో గొబ్బెమ్మలు, బతుకమ్మలు మినహా ఇతర వస్తువులను అమర్చవద్దు.
- ❖ ఇక్కడి విజేతలు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యే అవకాశం ఉంది.



# తొలిరోజు బిర్యానీ అంతంతే

- శనివారం స్పెషల్ రుచిచూడని మెజార్టీ విద్యార్థులు
- సగం పాఠశాలలో కూడా మధ్యాహ్న భోజనంలో కానరాని వెజ్ బిర్యానీ

**ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సిద్దిపేట, జనవరి6 :** ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజనంలో మార్పులు తీసుకొచ్చేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తున్నది. మెనూలో మార్పులతోపాటు సన్నబియ్యంతో భోజనం అందిస్తున్న విషయం తెలిసిందే. కాగా ప్రతి శనివారం నాణ్యమైన వెజ్ ( కూరగాయలు కలిపిన) బిర్యానీని విద్యార్థులకు వడ్డించాలని తాజాగా ఆదేశాలు జారీ చేశారు. వీటిని జిల్లాలో మొక్కుబడిగా పాటించారు.

జిల్లాలోని 974 ప్రభుత్వ పాఠశాలల్లో 85,313 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరంతా ప్రతి రోజూ మధ్యాహ్న సమయంలో పాఠశాలలోనే భోజనం చేస్తుంటారు. ప్రభుత్వ మెనూ ప్రకారం సన్నబియ్యంతో భోజనం వడ్డిస్తున్నారు. సోమ, బుధ, శుక్రవారాల్లో ఉడకబెట్టిన కోడిగుడ్డును కూడా అందిస్తున్నారు. ఈ రోజుల్లో పప్పు, చారు ఉంటుంది. మంగళ, గురు, శనివారాల్లో కూరగాయలు, చారుతో భోజనం పెడుతున్నారు.

## శనివారం స్పెషల్

కాగా ప్రతి శనివారమూ మధ్యాహ్న భోజనంలో వెజ్ బిర్యానీని అందించాలని తాజాగా విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఆదేశాలను అన్ని జిల్లాల విద్యాధికారులకు చేరవేశారు. రానున్న శనివారం అంటే జనవరి 6 నుంచే పాఠశాలల్లో పకడ్బందీగా అమలు చేయాలని సూచనలు చేశారు. బిర్యానీకి తోడుగా ఏదైనా ఒక కూర లేదా చారును కూడా వండాలని పేర్కొన్నారు. దీనికి సంబంధించి స్పష్టంగా ఉత్తర్వులను జారీ చేశారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని దేశవాళీకి సంబంధించిన పప్పులు, కూరగాయలు, ఆలుతో ఈ బిర్యానీని సిద్ధం చేయాలని పేర్కొన్నారు. వారంలో ఒకటి లేదా రెండు రోజులు పెట్టినా పర్వాలేదని, అయితే శనివారం మాత్రం కచ్చితంగా ఉండాలని సూచించారు.



శేరిపల్లిలో పరిశీలిస్తున్న ఎంఈవో రాములు, ములుగు మండలంలోని పాఠశాలలో కానరాని వెజ్ బిర్యానీ

## విద్యార్థుల్లో నిరుత్సాహం

శనివారం రోజు వెజ్ బిర్యాణీని వడ్డించనున్నారని పత్రికలు, ఛానళ్లలో చూసిన విద్యార్థులకు తొలిరోజే నిరాశే ఎదురైంది. కొన్ని చోట్ల మినహా మిగతా చోట్ల తెల్ల అన్నం, కూర, చారు కనిపించింది. కొన్ని పాఠశాలల్లో కూరగాయలు, ఆలు, ఇతర ముడిపదార్థాలతో అద్భుతంగా వెజ్ బిర్యానీని సిద్ధం చేశారు. మరికొన్ని పాఠశాలల్లో ఉడుకుతున్న బియ్యంలోనే నాలుగు ఆలుగడ్డ ముక్కలు, పది పర్చిమిర్చి ముక్కలు, రెండు క్యారెట్ ముక్కలు వేసి చేతులు దులుపుకున్నారు. ఇక తెల్ల అన్నం ఉన్న పాఠశాలల నిర్వాహకులను ప్రశ్నించగా తమకు ఎలాంటి ఆదేశాలు అందలేని పేర్కొన్నారు. మరికొందరేమో తమకు ఆదేశాలు వచ్చినందునే బిర్యానీ సిద్ధం చేయించామని చెపుతున్నారు.

## డీఈవోకే అస్పష్టత

కాగా వెజ్ బిర్యానీకి సంబంధించిన ఉత్తర్వులపై సిద్దిపేట జిల్లా డీఈవో విజయలక్ష్మీ అస్పష్టతతో ఉన్నారు. వెజ్‌బిర్యానీపై ఆమెను ఫోన్‌లో సంప్రదించగా తమకు స్పష్టమైన ఆదేశాలు రాలేదని చెప్పారు. మరికొన్ని చోట్ల ఎందుకు పెట్టారని ప్రశ్నించగా కనుక్కుని చెపుతానని అన్నారు. ఇదిలా ఉంటే పాఠశాల విద్యాశాఖ నుంచి ఎంఈవోలు, హెచ్‌ఎంల వరకు ఈ ఉత్తర్వులు అందాయి. ఈ ఉత్తర్వులను అన్ని జిల్లాల డీఈవోలకు కూడా పంపిస్తున్నట్లు స్పష్టంగా పేర్కొన్నారు.

# ఇసుక మాఫియాకు అడ్డుకట్ట వేయాలి

- నేరెళ్ల, కామారెడ్డి బాధితులకు న్యాయం చేయాలి
- సంఘటనలపై ముఖ్యమంత్రి స్పందించాలి
- సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలి
- టీ జేఏసీ చైర్మన్ ప్రొఫెసర్ కోదండరాం
- సిద్దిపేట నుంచి నేరెళ్లకు పాదయాత్ర ప్రారంభం
- హాజరైన తమ్మినేని, చాడ

**సిద్దిపేట అర్బన్ జనవరి 06 :** ఇసుక మాఫియాను అడ్డుకోవడంలో పోలీసుల చేతిలో చిత్రహింసలకు గురైన నేరెళ్ల బాధితులకు న్యాయం చేయాలని అక్రమంగా సాగుతున్న ఇసుక రవాణాకు అడ్డుకట్ట వేయాలని టీ జేఏసీ చైర్మన్ ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. నేరెళ్ల బాధితులకు న్యాయం చేయాలని శనివారం టీజేఏసీ, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సిద్దిపేట నుండి నేరెళ్ల వరకూ పాదయాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్రెండ్లీ పోలీస్ అంటే న్యాయం అడిగిన ప్రజలపైన థర్డ్ డిగ్రీ ప్రయోగించడమేనన్నారు. రాజ్యాంగంలో అందరికీ సమాన హక్కులు ఉన్నాయని, తెలంగాణలో ప్రజలకు ఒక హక్కు, పోలీసులకు, ప్రజాప్రతినిధులకు మరో హక్కు ఉంటుందా అని ప్రశ్నించారు. సీఎం కేసీఆర్ తనకంటూ ఒక ప్రత్యేక రాజ్యాంగాన్ని రాసుకున్నారన్నారు. ఇసుక మాఫియాకు ప్రభుత్వం వత్తాసు పలుకుతుందన్నారు. అడ్డుకున్న వారిని చిత్రహింసలకు గురి చేస్తే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోకపోవడం శోచనీయమన్నారు. ప్రజలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. కులం పేరుతో దూషించి దారుణంగా హింసించిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని కోరారు. బాధితులకు న్యాయం జరిగే వరకూ పోరాటం చేస్తామన్నారు. సీపీఎం రాష్ట్రకార్యదర్శి తమ్మినేని వీరభద్రం మాట్లాడుతూ టీఆర్‌ఎస్ పాలన అత్యంత నిర్బంధంగా కొనసాగుతుందన్నారు. టీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధుల కనుసన్నల్లోనే ఇసుక వ్యాపారం సాగుతోందన్నారు. మంత్రి కేటీఆర్ కూడా గారడి మాటలతోనే కాలం వెల్లబుచ్చుతున్నారన్నారు. ఇసుక మాఫియాను అడ్డుకోబోయి వారి వ్యాపార దాహానికి బలైన కామారెడ్డి వీఆర్‌ఏ కాదు అని చెప్పిన కేటీఆర్ ఇసుక మాఫియాకు ఏ స్థాయిలో వత్తాసు పలుకుతున్నరో తెలుస్తుందన్నారు. నేర ఘటనలో బాధితులను చిత్రహింసలు పెట్టినా ఎస్పీ విశ్వజిత్‌పై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి విధుల నుంచి సస్పెండ్ చేయాలన్నారు. ప్రజల పైన థర్డ్ డిగ్రీ ప్రయోగించడం సిగ్గుచేటన్నారు. ఇసుక మాఫియాను అడ్డుకోలేక ప్రజలపై కేసులు పెట్టడం ఆడలేక మద్దెల దరువు అన్నట్టుగా ప్రభుత్వం తయారైందన్నారు. సీపీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ నేరెళ్ల ఘటనలో 35 మందిపై కేసులు పెట్టి ఎనిమిది మందిని అరెస్టు చేశారన్నారు. అరెస్టు చేసిన వారిని పోలీసులు చిత్రహింసలకు గురిచేస్తూ ఇష్టానుసారంగా కొట్టడం దారుణం అన్నారు. ఇప్పటికి కూడా వారు కోలుకోలేని పరిస్థితుల్లో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కామారెడ్డిలో ఇసుక మాఫియాకు బలైన వీఆర్‌ఏ కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అక్రమంగా ఇసుక వ్యాపారం చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న ఇసుక మాఫియాను అడ్డుకుంటూ ఇదేమిటని ప్రశ్నిస్తే ప్రజలపైనా కేసులు పెట్టి, చిత్రహింసలు పెట్టడం చూస్తుంటే ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు ఇసుక మాఫియాకు ఏ స్థాయిలో మద్దతునిస్తున్నారో అర్థమవుతుందన్నారు. ఈ పాదయాత్రలో వారి వెంట సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి రంగారావు, సీపీఎం జిల్లా కార్యవర్గసభ్యులు రేవంత్ మల్లారెడ్డి, నాగరాజు, జగన్, యాదవరెడ్డి, కళావతి సీపీఐ నాయకులు మంద పవన్, ఎడ్ల వెంకట్రాంరెడ్డి, ఆరిఫ్, బన్సీలాల్, శంకర్, మన్నే కుమార్, జేఏసీ సిద్దిపేట జిల్లా చైర్మన్ బాబురావు టీపీఎఫ్ సత్తయ్య, పీడీఎస్ ఎఫ్ యాదగిరి, ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి రోమాల బాబు తదితరులు పాల్గొన్నారు.



పాదయాత్రలో తమ్మినేని, కోదండరాం, చాడ

# 'కాకతీయ' నాల్గో విడత నిధులు మంజూరు

- జిల్లాలో 167 చెరువులకు రూ. 35.60 కోట్లు విడుదల
- రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్ రావు



**సిద్దిపేట కల్చరల్, జనవరి6:** సిద్దిపేట జిల్లాలో మిషన్ కాకతీయ నాల్గో దశ పనులకు రూ.35.60 కోట్ల నిధులను మంజూరు చేసినట్లు మంత్రి హరీశ్‌రావు శనివారం తెలిపారు. దీనికి సంబంధించిన పరిపాలన అనుమతులకు ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని సిద్దిపేట (రూరల్, అర్బన్) మండలంలో 30 చెరువులకు రూ.6.52 కోట్లు, నంగునూరు మండలంలో 11 చెరువులకు రూ.1.83 కోట్లు, చిన్నకోడూరు మండలంలో 8 చెరువులకు రూ.3.02 కోట్లు, బెజ్జంకి మండలంలో 25 చెరువులకు రూ.4.36 కోట్లు, హుస్నాబాద్ నియోజకవర్గంలోని 29 చెరువులకు రూ.7.84 కోట్లు, దుబ్బాక నియోజకవర్గంలోని 36 చెరువులకు రూ. 6.26 కోట్లు, చేర్యాల, మద్దూరు మండలంలోని 28 చెరువులకు రూ.5.74 కోట్లు మంజూరయ్యాయన్నారు. త్వరలోనే టెండర్లు ప్రక్రియ కూడా పూర్తి చేసి పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు.

# గజ్వేల్ వంద పడకల ఆసుపత్రిని పరిశీలించిన ఎంపీ



ఆసుపత్రిని పరిశీలిస్తున్న కొత్త ప్రభాకర్‌రెడ్డి, భూంరెడ్డి

**గజ్వేల్, జనవరి 6 :** గజ్వేల్ పట్టణంలోని వంద పడకల ఆసుపత్రిని శనివారం మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి పరిశీలించారు. ఆసుపత్రిలో జరుగుతున్న పనులను గూర్చి సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, త్వరలోనే ప్రారంభానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఆసుపత్రిలో ఏర్పాటు చేయనున్న వసతులను గూర్చి ఆయన అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట హౌసింగ్ కార్పొరేషన్ భూంరెడ్డి, జీపీఎస్పీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, వైస్‌చైర్‌పర్సన్ అరుణ, సీనియర్ నాయకులు డాక్టర్ యాదవరెడ్డి తదితరులున్నారు.

# టీవీ కనెక్షన్ కట్ చేయాలి

- టెన్త్ విద్యార్థులతో ముచ్చటించిన డీఈవో

**సిద్దిపేట రూరల్ :** పదో తరగతి చదువుతున్న విద్యార్థులంతా ఇంట్లో టీవీ కనెక్షన్ కట్ చేయాలని, పిల్లల ఎదుట తగాదాలు పడకూడదని డీఈవో విజయ లక్ష్మి సూచించారు. శనివారం రాత్రి సిద్దిపేట మండలం తడ్కపల్లి గ్రామంలో పదో తరగతి చదువుతున్న విద్యార్థుల ఇళ్లను సందర్శించి పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడారు. అందరి కృషితోనే పిల్లలు ఉన్నత స్థాయిలో స్థిరపడుతారన్నారు. గ్రామంలోని విద్యార్థులు సరోజన, కల్యాణి, సాయికృష్ణల ఇంటికి వెళ్లి వారి తల్లిదండ్రులకు దండం పెట్టి చదివించాలని కోరారు.

# సిద్దిపేట



హలో ఆంధ్రజ్యోతి
ప్రకటనలు ఇచ్చేందుకు సంప్రదించండి
9985410904, 738671292
చందాదారుడిగా చేరేందుకు,
పత్రిక పంపిణీలో ఇబ్బందులపై
9948464409, 9985425475

మీ ప్రాంత సమస్యలను, మీరు చూసిన విశేషాలను మా విలేకరులకు చెప్పేందుకు కాల్ చేయండి. లేదా సమాచారాన్ని ఈ నంబర్లకు వాట్సప్ చేయండి


| | |
|---|---|
| కొమురవెల్లి రూరల్ | 9494614434 |
| దుబ్బాక | 9885890050 |
| మిరుదొడ్డి | 9177858036 |
| తొగుట | 9866165607 |
| చేర్యాల | 9951753043 |
| చేర్యాల టౌన్ | 9490455655 |
| చిన్నకోడూర్ | 9704962622 |
| నంగనూర్ | 9989149406 |



## ఆకునూరు ఉప ఎన్నికలో నలుగురి నామినేషన్ల ఉపసంహరణ

- బరిలో నిలిచింది ఐదుగురు
- అభ్యర్థులకు బీ-ఫారం, పార్టీ గుర్తులను కేటాయించిన ఎన్నికల అధికారులు
- ప్రచారానికి సిద్ధమైన అభ్యర్థులు
- టీఆర్ఎ్‌స్‌కు కాంగ్రెస్ ఝలక్‌తో అనివార్యమైన ఉప ఎన్నిక

**చేర్యాల, జనవరి 6:** మండల పరిధిలోని ఆకునూరు ఎంపీటీసీ-1 ఉప ఎన్నికకు నామినేషన్లు వేసినవారిలో శనివారం నలుగురు తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. టీఆర్ఎస్, కాంగ్రెస్, టీడీపీ, సీపీఎం, సీపీఐ, బీజేపీ తరఫున 9 నామినేషన్లు దాఖలు కాగా శనివారం టీడీపీ నుంచి ఇద్దరు, టీఆర్ఎస్, కాంగ్రెస్ తరఫున అదనంగా దాఖలు చేసిన ఒక్కో నామినేషన్‌ను ఉపసంహరించుకున్నారు. దీంతో ఎన్నికల అధికారులు బరిలో ఉన్న అభ్యర్థులకు బీ-ఫారం, పార్టీ గుర్తులు కేటాయించి అభ్యర్థుల జాబితాను ప్రదర్శించారు. ఇందులో బీజేపీ నుంచి అవ్వల్ శ్రీనివాస్, సీపీఐ నుంచి కంతుల రాజు, కాంగ్రెస్ నుంచి


అధికారులు ప్రకటించిన అభ్యర్థుల జాబితా

తాటికొండ వేణుగోపాల్, టీఆర్ఎస్ నుంచి శిగుల్ల నర్సమ్మ, సీపీఎం నుంచి సర్గం శ్రీకాంత్‌లు బరిలో నిలిచారు. చివరి క్షణం వరకు టీఆర్ఎస్ నాయకులు ఏకగ్రీవానికి యత్నించినా కాంగ్రెస్ ఝలక్ ఇవ్వడంతో ఉప ఎన్నిక అనివార్యమైంది.

దీంతో ఆయా పార్టీల అభ్యర్థులు ప్రచారం పర్వానికి సన్నాహాలు చేసుకుంటున్నారు. ఇందుకోసం ఆయా పార్టీల కార్యకర్తలు సన్నద్ధమవుతున్నారు. ఇదిలాఉండగా ఈ నెల 11న ఉప ఎన్నిక జరగనుండటంతో అన్ని పార్టీలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాయి. దీంతో అందరిచూపు ఆకునూరు వైపు మళ్లింది.

## రూ.6.57 కోట్లతో చెరువుల పునరుద్ధరణ

- 36 చెరువులకు నిధుల మంజూరు
- మూడు చెక్‌డ్యాంల ఏర్పాటు
- రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్ రామలింగారెడ్డి

**దుబ్బాక, జనవరి 6:** మిషన్ కాకతీయ నాల్గో ఫేజ్ ద్వారా దుబ్బాక నియోజకవర్గంలో 36 చెరువులకు పూర్వవైభవం రానుంది. ఇందుకు సంబంధించిన వివరాలను శనివారం రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్ సోలిపేట రామలింగారెడ్డి ప్రకటించారు. సుమారు రూ.6కోట్ల 57 లక్షలతో ఈ చెరువులను పునరుద్ధరించనున్నారు. చెరువులవారీగా నిధుల కేటాయింపు ఇలా ఉంది. దుబ్బాక మండలంలోని బల్వంతాపూర్ దుర్గంకుంట (రూ.6.25లక్షలు), పెద్దగుండవెల్లి పుల్లయ్యగారి కుంట(రూ.7.50లక్షలు), అప్పనపల్లిలోని చాకలివానికుంట(రూ.4.91లక్షలు), తొగుట మండలంలోని జప్తిలింగారెడ్డిపల్లిలో చిన్నరెడ్డికుంట(రూ.1.14కోట్లు), చందాపూర్‌లోని మేడి బంజరుకుంట(రూ.11.35లక్షలు) దౌల్తాబాద్ మండలం ముబారస్‌పూర్‌లోని మైసానికుంట(రూ.11.95లక్షలు), దొమ్మాటలోని మామిళ్లకుంటకు(రూ.17.67లక్షలు), సూరంపల్లిలోని కుమ్మరికుంట(రూ.6.75లక్షలు), తాళ్లకుంట(9లక్షల90వేలు), దొమ్మాటలోని కుమ్మరికుంట(రూ.7.22లక్షలు), రాయపోల్ మండలం మాంతూర్‌లోని సాదరిగనికుంటకు(రూ.12.25లక్షలు), అనాజీపూర్‌లోని మాసాన్‌కుంట (రూ.11.10లక్షలు), పటేలుకుంట(రూ.7.61లక్షలు), తిమ్మక్కపల్లిలోని హసాన్‌చెరువు(రూ.59.20లక్షలు), చేగుంట మండలం వడియారం గ్రామంలోని పర్వతాలకుంటకు(రూ.9.30లక్షలు), కాకుల కుంటకు (రూ.10.53లక్షలు), నర్సంపల్లిలోని చీరమని కుంటకు(రూ.11.2లక్షలు), మిరుదొడ్డి మండలం అల్వాల్‌లోని పిల్లిఒర్రె చెక్‌డ్యాంకు (రూ.6.75లక్షలు), మోతె గ్రామంలోని కర్నాలకుంట(11లక్షల60వేలు), అల్వాలలోని కర్నాల కుంటకు(రూ.9.70లక్షలు), తెల్లికుంట (రూ.14.35లక్షలు) మంజూరైనట్లు రామలింగారెడ్డి తెలిపారు. కూడవెల్లి వాగుపై చెక్‌డ్యాంల నిర్మాణానికి నిధులు మంజూరైనట్లు తెలిపారు. చెరువులకు నిధుల మంజూరుపై ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు ఎమ్మెల్యే రామలింగారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

## బీజేపీ అసెంబ్లీ కన్వీనర్‌గా పల్లె వంశీకృష్ణగౌడ్


నియామక పత్రాన్ని అందజేస్తున్న రఘునందన్‌రావు

**దుబ్బాక, జనవరి 6:** బీజేపీ దుబ్బాక అసెంబ్లీ కన్వీనర్‌గా దుబ్బాకకు చెందిన పల్లె వంశీకృష్ణగౌడ్‌ను ఆ పార్టీ నియమించింది. రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ ఆదేశాల మేరకు నియామక పత్రాన్ని శనివారం రాష్ట్ర అధికార ప్రతినిధి రఘునందన్‌రావు అందజేసి మాట్లాడారు. పార్టీకి నిరంతరం పనిచేసే కార్యకర్తలకు మంచి గుర్తింపు ఉంటుందన్నారు. తమ పార్టీ గ్రామస్థాయి నుంచి ఎదిగిన నాయకులను ప్రోత్సహిస్తుందన్నారు. క్షేత్రస్థాయిలో బీజేపీకి బలమైన క్యాడర్ ఉందన్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో దుబ్బాక నియోజకవర్గంపై కాషాయజెండా ఎగరేయడం ఖాయమన్నారు. వంశీకృష్ణగౌడ్ నాయకత్వంలో గ్రామగ్రామాన పార్టీ బలోపేతం అవుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. బీజేవైఎంలో కీలకంగా పనిచేసిన వంశీకృష్ణగౌడ్ పార్టీ అభ్యున్నతికి మరింత పాటుపడుతారన్నారు. వంశీకృష్ణగౌడ్ మాట్లాడుతూ నియోజకవర్గంలో కాషాయదళం నిరంతరం ప్రజల్లోకి వెళ్లి రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను వివరిస్తుందన్నారు. తనపై నమ్మకంతో అసెంబ్లీ కన్వీనర్‌గా నియమించిన రాష్ట్ర అధ్యక్షులు లక్ష్మణ్‌కు, బీజేపీ అధికార ప్రతినిధి రఘునందన్‌రావుకు, జిల్లా అధ్యక్షుడు నరోత్తంరెడ్డి, ప్రధాన కార్యదర్శి బాలేష్‌గౌడ్‌లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు తోట కమలాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, తిరుమల్‌రెడ్డి, రాజిరెడ్డి, ఎస్ఎన్‌చారి తదితరులున్నారు.

## ఉపాధి పనుల్లో నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు

- మిరుదొడ్డి ఎంపీడీవో మల్లికార్జున్ హెచ్చరిక

**మిరుదొడ్డి, జనవరి 6:** ఉపాధిహామీ పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలుంటాయని మిరుదొడ్డి ఎంపీడీవో మల్లికార్జున్ హెచ్చరించారు. శనివారం మిరుదొడ్డిలోని కార్యాలయంలో టీఏ, ఎఫ్ఏలతో ఆయన సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఉపాధిహామీ పనులను చేయడంలో మండలం వెనకబడి ఉందన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఈ పనులను వెంటనే ప్రారంభించాలని సూచించారు. లేనిపక్షంలో సంబంధిత టీఏ, ఎఫ్ఏలపై కఠిన చర్యలు తీసుకుంటామని మల్లికార్జున్ హెచ్చరించారు.

## 11న మల్లన్న ఆలయంలో వేలం పాటలు

**చేర్యాల, జనవరి 6:** ప్రముఖ శైవక్షేత్రం కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయంలో 11న సీల్డ్ టెండర్ కం బహిరంగ వేలం పాటలు నిర్వహించనున్నట్లు ఆలయ ఇన్‌చార్జి ఈవో రామకృష్ణారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు మొక్కులుగా అందించిన తలనీలాలు, ఒడిబియ్యం ప్రోగుచేసుకొనుటకు, మల్లన్న ఆలయ ఆవరణలో వెండికొరమీసములు అమ్ముకొను టకు, ఎల్లమ్మ ఆలయ ఆవరణలో కొబ్బరికాయలు, పూజాసామగ్రి అమ్ముకునేందుకు వేలంపాటలు జరపనున్నట్లు తెలిపారు.

## 'నాయీబ్రాహ్మణుల సంక్షేమానికి ముఖ్యమంత్రి కృషి'

**మిరుదొడ్డి, జనవరి 6:** నాయీబ్రాహ్మణుల అభివృద్ధికి సీఎం కేసీఆర్ నిరంతరం పనిచేస్తున్నారని నాయీబ్రాహ్మణ సంఘం సభ్యుడు సాయిలు అన్నారు. మిరుదొడ్డిలోని పెద్దమ్మ ఆలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దుబ్బాక నియోజకవర్గంలో నాయీబ్రాహ్మణుల సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే సోలిపేట రామలింగారెడ్డి కృషి చేస్తున్నారన్నారు. తొగుట మండలంలోని గోవర్ధనగిరి, రాయపోల్‌లోని నాయీబ్రాహ్మణ సంఘం కమ్యూనిటీ హాల్‌కు ఎమ్మెల్యే నిధులు మంజూరు చేయడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో నాయీబ్రాహ్మణ సంఘం నాయకులు ఉన్నారు.

## సావిత్రీబాయి పూలే జయంత్యుత్సవాలు

**మిరుదొడ్డి, జనవరి 6:** మండల కేంద్రమైన మిరుదొడ్డిలోని మోడల్ స్కూల్‌లో శనివారం సావిత్రీబాయి పూలే జయంతి వేడుకలను స్వేరోస్ రాష్ట్ర కార్యదర్శి తౌడ సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో మహిళలు గౌరవప్రదమైన స్థానంలో ఉన్నారంటే సావిత్రీబాయిపూలే పుణ్యమేనన్నారు. ఆమె మహిళలకోసం అనేక పోరాటాలు చేసిందన్నారు. ప్రతి మహిళ ఆమెను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అనంతరం మహిళ ఉపాధ్యాయులను శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్వేరోస్ సభ్యులు భారతి, కిషన్, ప్రసాద్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## రోడ్డును విస్తరించాలని రాస్తారోకో

**చేర్యాల, జనవరి 6:** చేర్యాల-సల్వాపూర్ రోడ్డువిస్తరణ పనులు చేపట్టాలని డిమాండ్ చేస్తూ శనివారం చుంచనకోట, లింగాపల్లి గ్రామస్థులు చుంచనకోట క్రాస్‌రోడ్డు వద్ద రాస్తారోకో చేశారు. బండపల్లికాలనీ క్రాస్‌రోడ్డు వద్ద జరిగిన రోడ్డుప్రమాదంలో బచ్చన్నపేట మండలం లింగంపల్లికి చెందిన బండి రాములు మృతిచెందడంతో జనగామ-సిద్దిపేట ప్రధాన రహదారిపై బైఠాయించారు. రోడ్డు విస్తరణ ప్రారంభించకపోవడంతోనే ప్రమాదాలు జరుగుతున్నాయని మండిపడ్డారు. అధికారుల నుంచి స్పష్టత వచ్చేవరకు ఆందోళన విరమించబోమన్నారు. వాహనాలు నిలిచిపోవడంతో పోలీసులు జోక్యం చేసుకుని ఆందోళనను విరమింపచేశారు.


రాస్తారోకో చేస్తున్న గ్రామస్థులు

## పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ కృషిచేయాలి

- దుబ్బాక నగర పంచాయతీ కమిషనర్ నర్సయ్య

**దుబ్బాక, జనవరి 6:** పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ కృషిచేయాలని దుబ్బాక నగరపంచాయతీ కమిషనర్ నర్సయ్య అన్నారు. దుబ్బాకలోని దుకాణ సముదాయాల్లో ప్లాస్టిక్ కవర్ల వాడకంపై శనివారం ప్రజలకు అవగాహన కల్పించారు. వ్యాపారులు ప్లాస్టిక్ కవర్లను వాడకూడదని, వాడేవారిపై కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. ప్లాస్టిక్ కవర్ల వాడకంతో పర్యావరణం దెబ్బతినే అవకాశం ఉందన్నారు. నాయి నిర్దేశించిన కవర్లను మాత్రమే వినియోగించాలని కమిషనర్ నర్సయ్య సూచించారు.

## పురాతన ఆలయాల్లో ధూపదీప నైవేద్య పథకం రెండో దశ సర్వే

- సిద్దిపేట జిల్లాలో 127 ఆలయాల్లో నిత్యపూజలు
- మరిన్ని ఆలయాల కోసం నోటిఫికేషన్ జారీతో 252 మంది నమోదు
- పరిశీలించనున్న ఐదుగురు సభ్యుల బృందం

**కొమురవెల్లిరూరల్, జనవరి 6:** పురాతన ఆలయాల్లో నిత్య పూజాదికాలు నిర్వహింపబడాలన్న సంకల్పంతో ప్రభుత్వం ధూపదీప నైవేద్య పథకాన్ని ప్రవేశపెట్టింది. ఇందులో భాగంగా సిద్దిపేట జిల్లాలో ఇప్పటివరకు 127 ఆలయాలు ఎంపికవడంతో నిత్యపూజలు నిర్వహిస్తున్నారు. ఇందుకుగాను అక్కడ పనిచేసే అర్చకులకు ప్రతినెలా రూ.6 వేల గౌరవ వేతనం అందుతోంది. ఈ పథకానికి కొనసాగింపుగా ప్రభుత్వం కొన్ని రోజుల క్రితం మరిన్ని ఆలయాలను ఈ పరిధిలోకి తేవడానికి నోటిఫికేషన్ జారీ చేసింది.

అర్హులైనవారు నమోదు చేసుకోవాలని మార్గనిర్దేశకాలు జారీ చేసి గత నెల 8న చివరి గడువుగా ప్రకటించింది. దీంతో సిద్దిపేట జిల్లాలో 252 మంది అవసరమైన పత్రాలతో నమోదు చేయించుకున్నారు. కాగా.. కొన్ని రోజులుగా సంబంధిత అధికారులు ఈ సర్టిఫికెట్లను మదింపు చేస్తున్నారు. ఇప్పటికే చాలా వరకు ఈ కార్యక్రమం పూర్తయిందని, త్వరలో జాయింట్ కలెక్టర్, ఎండోమెంట్ అసిస్టెంట్ కమిషనర్, శాస్త్రజ్ఞానం కలిగిన ఇద్దరు సీనియర్ అర్చకులు, సిద్దిపేట జిల్లా టెంపుల్ ఇన్‌స్పెక్టర్‌తో కూడిన ఐదుగురు సభ్యుల బృందం క్షేత్రస్థాయిలో పర్యటించనుందని అధికారులంటున్నారు. స్థానిక సర్పంచ్, వీఆర్వో, గ్రామపెద్దల సమక్షంలో పరిశీలన జరిపి, నియామకాలు పూర్తిచేయనున్నట్టు తెలిసింది. ఈ సందర్భంగా సిద్దిపేట జిల్లా టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శివాజీ ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ పారదర్శకంగా నియామకాలు పూర్తి చేయాలని ఆదేశాలున్నాయని, పరిశీలన సమయంలో ప్రతి విషయాన్ని డిజిటల్ కెమెరాలో నిక్షిప్తం చేయనున్నట్టు తెలిపారు. పరిశీలనకు వచ్చేముందు సంబంధిత వ్యక్తులకు ఆ విషయాన్ని తెలియజేస్తామన్నారు.

## రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- జడ్పీ వైస్ చైర్మన్ సారయ్య
- పంటల మద్దతు ధరకు సబ్ కమిటీ ఏర్పాటుపై హర్షం



సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ వైస్ చైర్మన్ సారయ్య

**నంగునూరు, జనవరి 6:** రైతు సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక పథకాలు ప్రవేశ పెడుతుందని జడ్పీ వైస్ చైర్మన్ సారయ్య అన్నారు. శనివారం నంగునూరులో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులు పండించిన పంటలకు కనీస మద్దతు ధర కల్పించేందుకు కేసీఆర్ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందన్నారు. పంటలకు మద్దతు ధర కల్పించేందుకు సబ్ కమిటీ ఏర్పాటు చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. రైతులకు పెట్టుబడి కోసం ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఎకరాకు రూ.8 వేలు కేటాయించిందన్నారు. రైతులకు సకాలంలో ఎరువులు, విత్తనాలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. వ్యవసాయానికి 24 గంటల నాణ్యమైన విద్యుత్ ఇస్తున్న ఘనత టీఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా రంగనాయకసాగర్, మల్లన్నసాగర్ ద్వారా ప్రతి ఎకరాకు సాగునీరు అందేలా భారీ నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు నిరంతరం శ్రమిస్తున్నారన్నారు.

ప్రాజెక్టుల పనులు త్వరితగతిన పూర్తయితే ఈ ప్రాంతం సస్యశ్యామలమవుతుందన్నారు. పేదలకు డబుల్ బెడ్ రూం ఇళ్లు, కుల వృత్తుల ఆదరణలో భాగంగా గొల్లకుర్మలకు గొర్రెల యూనిట్ పథకాలను మంజూరు చేస్తుందన్నారు. ఈ సమావేశంలో రైతు సమన్వయ సమితి నాయకులు బి.కిష్టారెడ్డి, వైస్ ఎంపీపీ నర్సింల్‌గౌడ్, భాస్కర్‌రెడ్డి, క్రాంతికుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో ఉన్నది అరాచక పాలన

- సర్పంచుల ఫోరం జిల్లా అధ్యక్షుడు యాదగిరి



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

**నంగునూరు, జనవరి, 6:** రాష్ట్రంలో అరాచకపాలన కొనసాగుతున్నదని జిల్లా సర్పంచుల ఫోరం ఆధ్యక్షుడు, కాంగ్రెస్ నాయకుడు దేవులపల్లి యాదగిరి ఆరోపించారు. శనివారం నంగునూరులో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. టీఆర్ఎస్ అవినీతి, అక్రమాలకు అధికారులు అండదండలు అందిస్తూ ప్రశ్నించినవారిపై అక్రమ కేసులు పెట్టి ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. తప్పులను కప్పిపుచ్చుకోడానికి కామారెడ్డి జిల్లాలో జరిగిన ఇసుక మాఫియాల చేతిలో మృతిచెందిన వీఆర్‌ఏ కేసును ప్రభుత్వమే తప్పుదారి పట్టిస్తుందన్నారు. టీఆర్ఎస్ పాలన తీరు ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తుందని యాదగిరి ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గుంటిపల్లి శ్రీనివాస్, మద్దెబోయిన నరేందర్, చెలికాని యాదగిరి, గౌరబోయిన సంపత్, కుమార్, దాసరికిషన్, కోల యాదగిరిలు పాల్గొన్నారు.

## ఎన్‌సీసీ విద్యార్థులకు సెల్ఫ్ లోడింగ్ రైఫిల్‌పై శిక్షణ



శిక్షణ ఇస్తున్న క్యాలీ రామ్‌జాటీ, పాల్గొన్న ఎన్‌సీసీ విద్యార్థులు

**సిద్దిపేట టౌన్, జనవరి 6:** ఎన్‌సీసీ విద్యార్థులకు సెల్ఫ్ లోడింగ్ రైఫిల్‌పై శనివారం కరీంనగర్ బెటాలియన్ ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా బెటాలియన్ బీహెచ్ఎం క్యాలీ రామ్ జాట్ మాట్లాడుతూ సెల్ఫ్ లోడింగ్ రైఫిల్‌పై ప్రతి ఎన్‌సీసీ విద్యార్థికి అవగాహన ఉండాలన్నారు. సాంకేతిక నైపుణ్యం పెంపొందించాలన్నారు. ఇందులో భాగంగా రైఫిల్‌ను నిర్దేశిత భాగాలుగా విభజించడం, ఫైరింగ్ విధానం, స్టాండింగ్ లైయింగ్, సిట్టింగ్‌ల్లో శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బెటాలియన్ నాయన్ సుబేదార్, సురేశ్‌కుమార్, హవల్దార్ విజయ్‌నాయక్, ధనశేఖర్, ఎన్‌సీసీ అధికారులు శ్రీనివాస్‌భరంగి పాల్గొన్నారు.

## 'పది' విద్యార్థులకు పేరెంట్స్ సహకారం అవసరం

- ఎంఈవో దేశిరెడ్డి

**నంగునూరు, జనవరి 6:** పదో తరగతిలో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలంటే వారి తల్లిదండ్రుల సహకారం ఎంతో అవసరమని ఎంఈవో దేశిరెడ్డి అన్నారు. శనివారం నంగునూరు హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పేరెంట్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థుల ఫలితాలు సాధించేందుకు పాఠశాల స్థాయిలో తీసుకొంటున్న చర్యలపై క్లుప్తంగా వివరించారు. పాఠశాలలో విద్యార్థులు చదువుకోవడానికి అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. విద్యార్థులను ఇళ్లలో టెలివిజన్, వాట్సప్, సెల్‌ఫోన్స్, ఫేస్‌బుక్ లాంటి వాటికి దూరంగా ఉంచాలని తల్లిదండ్రులను కోరారు. ముఖ్యంగా సోషల్ మీడియాకు దూరంగా ఉంచాలన్నారు. విద్యార్థుల భవిష్యత్‌కు పదో తరగతి పరీక్షలే కీలకమని సూచించారు. చదువులో వెనుకబడ్డ విద్యార్థులను ఉపాధ్యాయులు దత్తత తీసుకొని మంచి ఫలితాలు సాధించేలా చదివించాలన్నారు. ఈ సమావేశంలో హెచ్ఎం నాగభూషనం, ఎస్ఎంసీ చైర్మన్ శ్రీనివాస్, ఉపాధ్యాయులు ముకుందం, మిక్షపతి, నాగరాజు, శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహారెడ్డి, జనార్దన్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, యాదగిరి, రమేశ్, చంద్రశేఖర్‌శర్మ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న దేశిరెడ్డి

## మైసూరు అకాడమీలో 'శ్రీవాణి'కి ప్రథమ స్థానం

**సిద్దిపేట టౌన్, జనవరి 6:** హైదరాబాద్‌లోని మైసూరు అకాడమీ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయిలో 125 పాఠశాలల విద్యార్థులకు నిర్వహించిన ప్రతిభా పరీక్షలో స్థానిక శ్రీవాణి పాఠశాలకు చెందిన విద్యార్థి మహజన్ ప్రథమ స్థానంలో నిలిచాడు. గణిత శాస్త్రం, సామాన్య శాస్త్రం, ఒలింపియాడ్ పోటీల్లో ప్రథమ స్థానాన్ని సంపాదించాడు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్, ప్రిన్సిపాల్ కృపాకర్, రవీందర్‌రెడ్డి, శ్రీకాంత్, ఉపాధ్యాయులు మహజన్‌కు అభినందనలు తెలిపారు.

## సిద్దిపేటలో పీఆర్టీయూ డైరీ ఆవిష్కరణ



డైరీని ఆవిష్కరిస్తున్న డిప్యూటీ ఈవో శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి

**సిద్దిపేట కల్చరల్, జనవరి 6:** పీఆర్టీయూ డైరీని డిప్యూటీ ఈవో శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి శనివారం సాయంత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు ఇంద్రసేనారెడ్డి, ప్రధాన కార్యదర్శి నరేందర్‌రెడ్డిలు మాట్లాడుతూ ఉపాధ్యాయుల ప్రధాన సమస్యలైన సీపీస్ విధానాన్ని రద్దు చేయాలని, సర్వీస్ రూల్స్ రూపొందించి పదోన్నతులు, బదిలీలు చేపట్టాలని వారు ప్రభుత్వాన్ని కోరారు.

ఈ కార్యక్రమంలో దౌల్తాబాద్ ఎంఈవో నరమ్మ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

## 'హామీలను నెరవేర్చని టీఆర్ఎస్ ప్రభుత్వం'

**సిద్దిపేట కల్చరల్, జనవరి 6:** ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా టీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు లక్కరసు ప్రభాకర్ వర్మ అన్నారు. శనివారం సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో డివిజన్ ఎస్సీ సెల్ కన్వీనర్‌గా పట్టణానికి చెందిన పంగ సాయికుమార్‌ను ఎన్నిక చేస్తూ నియామక పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ వర్మ మాట్లాడుతూ టీఆర్ఎస్ పార్టీ అధికారంలోకొస్తే దళితున్ని ముఖ్యమంత్రిని చేస్తానన్న సీఎం కేసీఆర్ మాట మార్చారన్నారు. నేడు రాష్ట్రంలో దొరల పాలన నడుస్తుందన్నారు. ఇసుక మాఫియాను ప్రోత్సహిస్తూ అమాయకుల ప్రాణాలను పొట్టన పెట్టుకుంటుందని విమర్శించారు. ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని ఏనాడైనా భరోసా ఇచ్చారా అని ఆయన ప్రశ్నించారు. 2019 ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వహీద్‌ఖాన్, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎండీ కలీముద్దీన్, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు దేవులపల్లి యాదగిరి, డీసీసీ కార్యదర్శి అత్తూ ఇమామ్, ఎన్ఎస్‌యూఐ నాయకుడు దాసరి రాజు, నాయకుడు సాయి ఈశ్వర్ గౌడ్, పీసీసీ సభ్యుడు మహేందర్, నాయకులు శ్రీనివాస్, షాబుద్దీన్ పాల్గొన్నారు.



సాయికుమార్‌కు నియామక పత్రాన్నిస్తున్న కాంగ్రెస్ నాయకులు

## 'తడి, పొడి చెత్తను వేర్వేరుగా అందించాలి'

**సిద్దిపేట మునిసిపాలిటీ, జనవరి 6:** ప్రజలు తమ ఇంటి వద్దకు వస్తున్న మునిసిపల్ చెత్త సేకరణ వాహనాలకు తమ వద్దనే చెత్తను తడి, పొడిగా వేర్వేరుగా అందించాలని మునిసిపల్ కమిషనర్ పీ.శ్రీనివాస్‌రెడ్డి ప్రజలకు సూచించారు. మార్నింగ్ వార్డు వాచ్‌లో భాగంగా శనివారం రూట్ నంబర్ 9 లో ఆయన పరిశీలించారు. ప్రజలంతా 'స్వచ్ఛ సర్వేక్షణ్'కు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ వెంట టీపీబీవో ప్రవీణ్, శ్రీనివాస్‌రెడ్డి సిబ్బంది ఉన్నారు.

## 'రక్తదానం చాలా గొప్పది'

**సిద్దిపేట మునిసిపాలిటీ, జనవరి 6:** అన్ని దానాల్లోకంటే రక్తదానం చాలా గొప్పదని అంబిటస్ పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీమతి ఎడ్ల జ్యోతి అన్నారు. శనివారం పాఠశాలలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన అనంతరం ఆమె మాట్లాడుతూ పిల్లలకు రక్తదానంపై అవగాహన కల్పించుటకు పాఠశాల కమిటీ ఆధ్వర్యంలో శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ ఎ.శ్రీనివాస్‌రెడ్డి, ప్రభుత్వ వైద్యశాల రక్తనిధి కేంద్రం డైరెక్టర్ రాంమోహన్, సిబ్బంది, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు. మొత్తం 60 యూనిట్ల రక్తాన్ని సేకరించామన్నారు.



రక్తదానం చేస్తున్న సిబ్బంది

## 'దళితులకు గొప్ప గౌరవం దక్కింది'

**సిద్దిపేట కల్చరల్, జనవరి 6:** ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఏర్పాటు చేసి, సిద్దిపేట బిడ్డకు చైర్మన్ పదవి రావడంతో సిద్దిపేట గడ్డ దళితుల గౌరవం పెంచారని ముఖ్యంత్రి కేసీఆర్, మంత్రి హరీశ్‌రావుకు సిద్దిపేట దళిత సంఘాలు కృతజ్ఞతలు తెలుపుతూ హర్షం వ్యక్తం చేశాయి. శనివారం సిద్దిపేటలోని భారీ నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఉమ్మడి మెదక్ జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ రాగుల సారయ్య, మునిసిపల్ కౌన్సిలర్లు గ్యాదరి రవి, నాయకులు సాకి ఆనంద్, బహుజన పరివర్తన సమితి రాష్ట్ర అధ్యక్షుడు భీమాసేన, జిల్లా సమన్వయ కర్త మెరుగు మహేష్, జిల్లా గిరిజన సంక్షేమ అధ్యక్షుడు బిక్షునాయక్ కలసి తదితరులు మాట్లాడారు.

## ‘నగరపంచాయతీ కార్యాలయ భవనాన్ని వేరే చోట నిర్మించవద్దు’

**హుస్నాబాద్,జనవరి 6:** హుస్నాబాద్ నగరపంచాయతీ కార్యాలయ భవనాన్ని ప్రస్తుతం ఉన్నచోటనే నిర్మించాలని పలువురు కౌన్సిలర్లతో పాటు నాలుగో వార్డు ప్రజలు శనివారం నగరపంచాయతీ చైర్మన్ సుద్దాల చంద్రయ్యకు వినతిపత్రం సమర్పించారు. ప్రస్తుతం ఉన్న చోట కాకుండా కరీంనగర్ రోడ్డులోని మర్యాల ఎల్లారెడ్డి, పిల్లి రాజయ్యల భూమిలో నగరపంచాయతీ కార్యాలయ భవనాన్ని నిర్మించుటకు స్థల పరిశీలన చేసినట్లు తెలిసిందని పేర్కొన్నారు. గతంలో కూడా వేరే చోట నిర్మిస్తామనే ప్రచారం కావడంతో ధర్నాలు నిర్వహించడం జరిగిందని, దీనికి ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్ స్పందించి ప్రస్తుతం ఉన్నచోటనే నూతనంగా రెండు అంతస్తుల భవనాన్ని నిర్మిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. ఇక్కడి ప్రజల మనోభావాలకు అనుగుణంగా ప్రస్తుతం ఉన్నచోటనే నూతన నగరపంచాయతీ భవన నిర్మాణాన్ని నిర్మించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు గూళ్ళ అరుణ్ జ్యోతి,గాదెపాక రవీందర్, పచ్చిమట్ల ప్రతిభ, దండి లక్ష్మీ, గూళ్ళ రాజు,వార్డు ప్రజలు బూరుగు సదానందం, బి స్వరూప, కె పద్మ, సుజాత, రాదిక,గట్ల చంద్రమౌళి, గూళ్ళ తిరుపతి, రాజమౌళి పాల్గొన్నారు.


నగరపంచాయతీ చైర్మన్ చంద్రయ్యకు వినతిపత్రం సమర్పిస్తున్న కౌన్సిలర్లు, ప్రజలు

## చెరువులు, కుంటలు, చెక్‌డ్యాంలకు నిధులు మంజూరు

**బెజ్జంకి, జనవరి 6:**మిషన్ కాకతీయ 4వ దశ మొదటి విడతలో భాగంగా మండలంలోని పలు గ్రామాల్లోని చెరువులు, కుంటలు, చెక్ డ్యాంల మరమ్మతులకు ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ప్రతి పాదనల మేరకు భారీ నీటి పారుదల శాఖ మంత్రి తన్నీరు హరీశ్ రావు మండలానికి రూ.367.93కోట్ల భారీ నిధులు మంజూరు చేసినట్లు జడ్పీటీసీ తన్నీరు శరత్‌రావు శనివారం తెలిపారు. గూడెం గ్రామంలోని సీతారాముల కుంట 2 ఎకరాలకు రూ. 24.75 లక్షలు, మరో ఎకరానికి రూ. 23.90లక్షలు, హన్మండ్లవారి చెక్‌డ్యాంకు రూ. 14.98లక్షలు, బెజ్జంకి గుడికుంటకు రూ. 29.80లక్షలు, రేగులపల్లి కోలంపు చెక్‌డ్యాం రూ. 14.05, బోజ్జల చెక్‌డ్యాం రూ. 7.90, తర్నాసి కుంట, చెక్‌డ్యాం రూ. 8.80, ముంజోల్ల చెక్ డ్యాం రూ. 10.55, లక్ష్మీపూర్ ఫీడర్ చానెల్ పనులు దుమ్మదుగకు కుంట నుంచి మల్లారెడ్డి కుంట వరకు రూ. 10.20లక్షలు, శీలాపూర్ జంగపడిపాయ చెక్ డ్యాం రూ. 34.87 లక్షలు, కొంకటి మల్లయ్య చెక్‌డ్యాం రూ.12.85లక్షలు, తెగిమట్ట నర్సయ్య చెరువు రూ. 17.70లక్షలు, కొల్లాల చెక్‌డ్యాం 23.70, నిషాని నర్సయ్య చెక్ డ్యాం రూ. 5.69, మల్లయ్యగారి చెక్‌డ్యాం రూ. 16.30, ఎర్ర బాలయ్య ఒర్రె చెక్ డ్యాం రూ. 14.90, కల్లెపల్లి ఎర్రగుంట రూ. 20.16, దాచారం రాజన్నకుంట 22.90, రాజమల్లయ్య చెక్‌డ్యాం రూ. 13.95, ఈదుల వాగు చెక్‌డ్యాం రూ. 16.15,కురుమ కుంట రూ. 23.38 లక్షలతో మొత్తం 367.93కోట్ల నిధుల మంజూరీ అయినట్లు తెలిపారు. మండలంలోని చెరువులు, కుంటలు, చెక్‌డ్యాంల మరమ్మతులకు భారీగా నిధులు మంజూరు కావడంపై ఆయా గ్రామాల్లోని రైతులు, ప్రజలు, నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

## సిద్దిపేటకు తరలిన ఎస్ఎఫ్ఐ నాయకులు

**కోహెడ, జనవరి 6:** సిద్దిపేట జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభలకు కోహెడ మండలం నుంచి ఎస్ఎఫ్ఐ నాయకులు శనివారం తరలివెళ్లారు. ఈ మహాసభల్లో ప్రభుత్వాలు అవలంభిస్తున్న విద్యావ్యతిరేక విధానాలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందించనున్నట్లు ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షుడు కొంకట పర్శరాములు తెలిపారు. తరలిన వారిలో శ్రీనివాస్, సమీర్, రంజిత్, సాయిచరణ్, అనిల్, మల్లేశ్, సురేష్, ప్రేమ్ సాగర్ ఉన్నారు.

## హైదరాబాద్‌కు తరలిన పారిశుధ్య కార్మికులు

**హుస్నాబాద్,జనవరి 6 :** సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన బహిరంగసభకు హుస్నాబాద్ నగరపంచాయతీ పారిశుధ్య కార్మికులు తరలివెళ్ళారు.ఈ సందర్భంగా హుస్నాబాద్‌లో ర్యాలీ నిర్వహించారు. దాదాపు 60 మంది కార్మికులు బహిరంగ సభకు వెళ్ళారు. ఈ కార్యక్రమంలో పారిశుధ్య కార్మికుల సంఘం నాయకులు గడిపె సారయ్య, ఖాత బాలయ్య, కనుకయ్య, పార్వంది స్వామి, సురేష్, శ్రీకాంత్, సంపత్,శ్రీనివాస్ ఉన్నారు.

## బస్సు సౌకర్యం కల్పించడంపై హర్షం

**హుస్నాబాద్, జనవరి 6:** హుస్నాబాద్ నుంచి నాగారం, మడద,బొమ్మనపల్లి, రేగొండ మీదుగా కరీంనగర్‌కు ఆర్టీసీ బస్సు నడిపించడం హర్షనీయమని ప్రజాప్రతినిధులు, టీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు.దీనికి ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్ ఎంతో కృషి చేశారని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు జడ్పీవైస్ చైర్మన్ రాయిరెడ్డి రాజారెడ్డి, నగరపంచాయతీ చైర్మన్ సుద్దాల చంద్రయ్య,ఎంపీపీ భూక్య మంగ,మార్కెట్ కమిటీ చైర్మన్ లింగాల సాయన్న,టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వంగ వెంకట్రామిరెడ్డి, ఎడబోయిన తిరుపతిరెడ్డిలు కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రమాదవశాత్తు కందిపంట దగ్ధం

**మద్దూరు జనవరి 6 :** ప్రమాదవశాత్తు కందిపంట దగ్ధం సంఘటన మండలంలోని గాగిళ్లాపూర్ లో చోటుచేసుకుంది. బాధితుడు బండి బాలయ్య కథనం ప్రకారం గ్రామంలో తనకున్న రెండెకరాల భూమిలో కందిపంట వేయగా కోతకోసే సమయంలో ప్రమాదవశాత్తు నిప్పంటుకుని దగ్ధమైందన్నారు. ఈ ఘటనలో సుమారు రూ.50 వేల పంట నష్టపోయినట్లు బాధితులు బాలయ్య కన్నీటి పర్యంతమయ్యారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

## క్యాలెండర్ ఆవిష్కరణ

**బెజ్జంకి, జనవరి 6:** పాతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి నూతన పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని టీపీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం మండల అధ్యక్షుడు బాల్‌రాజ్ అన్నారు. శనివారం టీపీటీఎఫ్ క్యాలెండర్‌ను ఎంఈవో పావని చేతుల మీదుగా ఆవిష్కరించారు. మండల శాఖ ప్రధాన కార్యదర్శి కన్నయ్య, జిల్లా కౌన్సిలర్ శ్రీనివాస్, అయిలయ్య, స్వామి, పద్మ, సుజాత, జ్యోతి, అరుంధతి ఉన్నారు.

## మరుగుదొడ్ల వాడకంపై అవగాహన కల్పించాలి

• స్వచ్ఛ భారత్ రిసోర్స్ పర్సన్ రాజమణి

**మద్దూరు జనవరి 6 :** ప్రభుత్వం స్వచ్ఛత కోసం నిర్మించిన మరుగుదొడ్లను ప్రజలు వినియోగించుకునేలా చూడాల్సిన బాధ్యత గ్రామజ్యోతి కమిటీలపై ఉందని స్వచ్ఛభారత్ రిసోర్స్ పర్సన్ పి. రాజమణి, టీవోటీ నర్సింహులు తెలిపారు. శనివారం మండలంలోని గాగిళ్లాపూర్‌లో గ్రామసర్పంచ్ మేక శ్రీలతసంతోష్ అధ్యక్షతన నిర్వహించిన గ్రామజ్యోతి కమిటీ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కమిటీ సభ్యులు ప్రణాళికతో గ్రామాభివృద్ధి కోసం ప్రభుత్వం మంజూరు చేసిన సంక్షేమ పథకాలను సద్వినియోగమయ్యేలా చూడాలన్నారు. అలాగే నీటి వృథాను అరికట్టేందుకు ఇంకుడు గుంతల నిర్మాణాలతో భూగర్భజలాల పెంపుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ భాగ్యలక్ష్మి, గ్రామజ్యోతి కమిటీ సభ్యులు, వార్డు సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## అడవి పందుల దాడిలో వేరుశనగ పంట ధ్వంసం

**కోహెడ, జనవరి 6:** మండలంలోని తీగలకుంటపల్లి గ్రామానికి చెందిన కూకట్ల పోశయ్, మెతుకు కనుకారెడ్డి అనే ఇద్దరు రైతులకు చెందిన వేరుశనగ పంటను శుక్రవారం రాత్రి అడవి పందులు దాడి చేసి ధ్వంసం చేశాయి. కనుకారెడ్డి మూడెకరాలన్నర వేరుశనగ పంటను సాగు చేశారు. పంట కాయ దశకు చేరింది. రాత్రి అడవి పందుల దాడిలో ఎకరన్నర పంటను ధ్వంసం అయింది. దీంతో సుమారు రూ.30వేల నష్టం వాటిల్లిందని రైతులు వాపోయారు. అలాగే పోశయ్య ఎకరం పంట సాగు చేశారు. సుమారు రూ.20వేల నష్టం జరిగినట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వ్యవసాయధికారుల సర్వే చేయించి నష్ట పరిహారం చెల్లించాలని రైతులు కోరుతున్నారు.


అడవి పందుల దాడిలో నష్టమైన పంట

## గాగిళ్లాపూర్‌లో క్రికెట్ పోటీలు

**మద్దూరు జనవరి 6 :** మండలంలోని గాగిళ్లాపూర్‌లో క్రికెట్ పోటీలను కురుమ సంఘం మండలాధ్యక్షుడు మేక సంతోష్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సంతోష్ మాట్లాడారు. గాగిళ్లాపూర్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రారంభించిన క్రికెట్ క్రీడోత్సవాలు శారీరక, మానసికోల్లాసానికి దోహద పడుతాయన్నారు. ఇరువురి మధ్య క్రీడోత్సవాలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయన్నారు. యువత క్రీడోత్సవాల పట్ల ఆసక్తి చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు తాజొద్దీన్, చింతల ప్రవీణ్, స్వామి, మల్లేశం, టీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు శ్రీకాంత్, ఆంజనేయులు, వేణు, రాజు, గణేష్, మహేష్ ఉన్నారు.

## ‘పోస్టుమన్‌తో ఇబ్బందులు తొలగించాలి’

**మద్దూరు జనవరి 6 :** ప్రభుత్వం అందించే ఆసరా పింఛన్ల పంపిణీలో లబ్దిదారులను ఇబ్బందులకు గురిచేస్తున్న పోస్టుమన్‌పై చర్యలు తీసుకోవాలని మండలంలోని గాగిళ్లాపూర్ గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై శనివారం గ్రామస్థులు పోస్టుమెన్ తాటికొండ బ్రహ్మానందంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ నిరసన తెలిపారు. ప్రభుత్వం ప్రతి నెలా ఆసరా పింఛన్లను పోస్టాఫీసు ద్వారా అందిస్తున్న క్రమంలో లబ్దిదారులను అవహేళనగా మాట్లాడుతుండటాన్ని జీర్ణించుకోలేక పోతున్నామన్నారు. మహిళలను కించపర్చే విధంగా మాట్లాడుతున్న పోస్టమెన్‌పై మహిళా సంఘాలతో పాటు ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టర్ తక్షణమే స్పందించి గ్రామస్థుల ఇబ్బందులను తొలగించాలని డిమాండ్ చేశారు.

## అంతకపేట ప్రభుత్వ పాఠశాలలో మాక్ పోలింగ్

**అక్కన్నపేట, జనవరి 6:** మండలంలోని అంతకపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం మాక్ పోలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసి సిబ్బందిని విద్యార్థులను నియమించారు. ఓటు వేసేందుకు విద్యార్థులకు గుర్తింపు కార్డులను అందించారు. ఏ పార్టీకి ఓటు వేయాలన్నా ఓటరుకు స్వంతగా నిర్ణయం తీసుకుని వేయాలని పలువురు వక్తలు సూచించారు. 18 సంవత్సరాలు నిండిన తరువాత ప్రతి ఒక్కరికి ఓటు హక్కు వస్తుందని ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేందుకే పాఠశాలలో మాక్ పోలింగ్‌ను ఏర్పాటు చేసినట్లు ఎస్ఎంసీ చైర్మన్ రామంచ మహేందర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు క్యూలైన్లో నిలుచుని ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇందులో పాఠశాల హెచ్ఎం వేల్పుల రత్నంతో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## నేరెళ్లకు తరలిన న్యూడెమోక్రసీ నాయకులు

**మద్దూరు జనవరి 6 :** నేరెళ్ల ఘటన బాధ్యులను కఠిన శిక్షించాలని కోరుతూ న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో శనివారం బీజేపీ తలపెట్టిన పాదయాత్రకు నాయకులు తరలివెళ్ళారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల కార్యదర్శి నర్సింహాచారి మాట్లాడారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని నేరెళ్ల దళితులు ఇసుక మాఫియాను అడ్డుకుంటే వారిపై అక్రమ కేసులు పెట్టి చిత్రహింసలకు గురిచేసి జైళ్లల్లో పెట్టిన పోలీసులను, ఘటనకు బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మైసయ్య, బాల్‌రాజ్, లచ్చయ్య, కనకయ్య, యాదయ్య, కిషోర్, నవీన్ ఉన్నారు.

# భూసేకరణకు రైతులు సహకరించాలి

- భూములకు మెరుగైన పరిహారం అందిస్తాం
- సిద్దిపేట ఆర్డీవో ముత్యంరెడ్డి
- దొమ్మాట, సూరంపల్లి గ్రామాల్లో రైతులతో సమావేశం

**రాయపోల్, జనవరి 6:** మల్లన్నసాగర్ ప్రాజెక్టు ద్వారా గ్రామాల్లోని చెరువులకు నీటిని సరఫరా చేసేందుకు కాలువలను తవ్వడానికి అవసరమైన భూమిని రైతులు ప్రభుత్వానికి అప్పగించి సహకరించాలని సిద్దిపేట ఆర్డీవో ముత్యంరెడ్డి కోరారు. శనివారం దౌల్తాబాద్ మండలం దొమ్మాట, సూరంపల్లి గ్రామాలలో కాలువల కోసం భూమిని కోల్పోతున్న రైతులతో సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు కోల్పోతున్న భూములకు ప్రభుత్వం మెరుగైన పరిహారం అందిస్తుందని తెలిపారు. ఎకరాకు రూ. 6.50లక్షల చెల్లిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ భూమి వర్షాధారంగా సాగయితే ఎకరాకు రూ. 5లక్షలు చెల్లించడం జరుగుతుందన్నారు. పరిహారాన్ని రూ. 12లక్షలకు పెంచాలని రైతులు ఆర్డీవోను కోరారు. సర్టిఫికెట్ లేకుండా లేదా సర్టిఫికెట్ ఉండి సాగు చేయని ప్రభుత్వ భూములకు రూ. 3లక్షల పరిహారం వస్తుందన్నారు. సేకరించే భూములలో కొట్టాలు, బోరు, పైపులైన్‌లు ఉంటే వాటి విలువను చెల్లించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నరేందర్, ఎంపీడీవో వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.


సూరంపల్లిలో రైతులతో మాట్లాడుతున్న ఆర్డీవో ముత్యంరెడ్డి

## ఘనంగా డిప్యూటీ స్పీకర్ జన్మదిన వేడుకలు

**జగదేవ్‌పూర్, జనవరి 6:** డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని శనివారం జగదేవ్‌పూర్ మండల కేంద్రంలోని మదన దుర్గమ్మ దేవాలయంలో టీఆర్‌ఎస్ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థుల మధ్య జన్మదిన వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి, విద్యార్థులకు పండ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ రామచంద్రం, టీఆర్‌ఎస్ జిల్లా యూత్ వింగ్ నాయకులు సంతోష్ రెడ్డి, టీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షులు గుండా రంగారెడ్డి, సర్పంచ్ కరుణాకర్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు. అలాగే డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్‌రెడ్డికి టీఆర్‌ఎస్ జగదేవ్‌పూర్ మండలాధ్యక్షుడు గుండ రంగారెడ్డి, యూత్ విభాగం జిల్లా నాయకుడు సంతోష్‌రెడ్డిలు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. శనివారం హైదరాబాద్‌లోని ఆమె నివాసంలో డిప్యూటీ స్పీకర్‌ను కలిసిన వారు బొకే అందించి శుభాకాంక్షలు తెలిపారు.


జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న టీఆర్‌ఎస్ నాయకులు

## హరితహారం మొక్కల సంరక్షణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

- ఎంపీడీవో కౌసల్యాదేవీ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

**ములుగు, జనవరి 6:** హరితహారంలో నాటిన మొక్కల సంరక్షణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ములుగు ఎంపీడీవో కౌసల్యాదేవీ అన్నారు. శనివారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో 'మేకలకు ఆహారంగా మారిన హరితహారం మొక్కలు' అనే శీర్షికన ప్రచురితమైన వార్తా కథనానికి ఆమె స్పందించారు. ఈ సందర్భంగా ఆమె ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ మొక్కల నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన సదరు అధికారులు, హరిత సైనికులపై చర్యలు తీసుకుంటామన్నారు. మండలంలోని హరితహారంలో భాగంలో నాటిన మొక్కలు సంరక్షించే బాధ్యతను అందరూ భాగస్వాములు కావాలని కోరారు. అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలన్నారు. ఇప్పటికే కొన్ని గ్రామాలలో చెట్ల విషయంలో సంబంధిత అధికారులు ఆరోపణలు వచ్చాయని, ఇలాంటి విషయంలో అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేసి చెట్లను ఎండిపోకుండా చూడాలన్నారు. దానితోపాటు హరితహారం భాగంలో నాటిన మొక్కలు ప్రజాప్రతినిధులు, యువజన సంఘాలు కూడా పర్యవేక్షణ చేసి పర్యవేక్షణ చేసి చెట్ల విషయంలో ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా ఉండాలని కోరారు. అలాగే గ్రామంలో జరుగుతున్న కార్యక్రమాలపై పంచాయతీ కార్యదర్శులు అప్రమత్తంగా ఉండాలని, ఏ గ్రామంలో చెట్లు ఎండిపోయినా పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు.

## డీబీటీ మిషన్ల ద్వారానే ఎరువుల విక్రయాలు

**రాయపోల్:** ఇకమీదట రైతులు విధిగా డీబీటీ మిషన్ల ద్వారానే ఎరువులు కొనుగోలు చేయాల్సి ఉంటుందని దౌల్తాబాద్ మండల వ్యవసాయాధికారి గోవిందరాజులు పేర్కొన్నారు. శనివారం ఆయన దౌల్తాబాద్ లో డీబీటీ మిషన్ల ద్వారా ఎరువుల విక్రయాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో అవసరమైన మేరకు ఎరువులు సిద్ధంగా ఉన్నాయన్నారు. ఎరువులు అవసరమైన రైతులు ఆధార్ కార్డ్‌ను తీసుకొచ్చి దుకాణాల్లో కొనుగోలు చేయాలని సూచించారు. ప్రభుత్వం తీసుకున్న ఈ చర్యల వల్ల కృత్రిమ కొరత నివారణ, అధిక ధరలకు విక్రయాలు, బ్లాక్ మార్కెట్ తదితర సమస్యల నివారణ జరుగుతుందన్నారు. రైతులు సహకరించాలని కోరారు.


డీబీటీ మిషన్ ద్వారా ఎరువుల విక్రయాన్ని ప్రారంభిస్తున్న ఏవో గోవిందరాజులు

## రాజీవ్ రహదారిపై ఎమ్మార్పీఎస్ ధర్నా

**గజ్వేల్‌టౌన్, జనవరి 6:** ఎస్సీ వర్గీకరణ సాధన కోసం ఉపవాస దీక్ష చేస్తున్న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణను అక్రమంగా అరెస్ట్ చేయడాన్ని నిరసిస్తూ ఎమ్మార్పీఎస్ నాయకులు ప్రజ్ఞాపూర్ రాజీవ్ రహదారిపై శనివారం ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. మంద కృష్ణను, ఎంఎస్‌ఎఫ్ జాతీయ అధ్యక్షుడు రుద్రవరం లింగస్వామి, రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేశ్‌లను వెంటనే బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ గజ్వేల్ ఇన్‌ఛార్జ్ మాదాసు యాదగిరి, ఎంఎస్‌ఎఫ్ నాయకులు గడ్డం అంజయ్య, ముంద్రాతి కృష్ణ, స్వామి, నరేశ్, ప్రశాంత్, భాను, శ్రీకాంత్ ఉన్నారు.


ధర్నా చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

## కుక్కల దాడిలో గొర్రెలు మృతి

**ములుగు, జనవరి 6:** కుక్కల దాడిలో గొర్రెలు మృతి చెందిన సంఘటన ములుగు మండలం నర్సాపూర్ గ్రామంలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన పూడరి మల్లయ్య రోజువారీగానే శుక్రవారం తన గొర్రెలను మేపుకొని వచ్చి కొట్టంలో తోలాడు. శనివారం తెల్లవారుజామున చూసే సరికి గొర్రెల మందపై వీధి కుక్కల దాడి చేయడంతో 25 గొర్రెలు మృతి చెందినట్లు గుర్తించారు. ప్రభుత్వం అందించిన సబ్సిడీ గొర్రెలతో కలిపి మొత్తం 29గొర్రెలు ఉండగా 25గొర్రెలు మృతిచెందాయని, మిగిలిన నాలుగు ప్రాణాపాయ స్థితిలో ఉన్నాయని, బాధితుడు మల్లయ్య విలపిస్తూ తెలిపాడు. విషయం తెలుసుకున్న సర్పంచ్ మల్లేశ్‌యాదవ్, టీఆర్‌ఎస్ నాయకులు రాజేందర్‌రెడ్డి, ఏనుగు బాపురెడ్డి, నర్సింహారెడ్డి మల్లయ్యను పరామర్శించారు.

## సీఎం దత్తత గ్రామంలో గ్రామసభ

**మర్కుక్, జనవరి 6:** సీఎం కేసీఆర్ దత్తత గ్రామమైన మర్కుక్ మండలంలోని ఎర్రవల్లి గ్రామంలో శనివారం సర్పంచ్ భాగ్య బాలరాజు ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. గ్రామాభివృద్ధికి కావాల్సిన ప్రణాళికలు సిద్ధం చేశారు. అభివృద్ధి చెందిన గ్రామం తో పాటు ఆదర్శ గ్రామంగా మార్చడం కోసం చేయాల్సిన పనులను గూర్చి చర్చించారు. వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ రామకృష్ణ, వార్డు సభ్యులు రత్నమాల, భాగ్య, రజిత, బాలమణి, సాయిలు, బాబు, ఆనందచారి, దాసు, ఆంజనేయులు, ఐలయ్య పాల్గొన్నారు.

## 'గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కృషి'

**కొండపాక, జనవరి 6:** గ్రామీణ ప్రాంతాల్లో కనీస వసతులు కల్పించడమే ధ్యేయంగా తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందని డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి అన్నారు. కొండపాకలో శనివారం సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలు అన్నిరంగాల్లో అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ భూలక్ష్మి, నాయకులు ఆరే భాస్కర్, రామకృష్ణ రెడ్డి, నరేందర్ పాల్గొన్నారు.

## ధర్మదీక్షకు సంపూర్ణ మద్దతు

**గజ్వేల్, జనవరి 6:** అయుత ధర్మదీక్షకు తమ సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు రిక్కల రవిందర్‌రెడ్డి తెలిపారు. గజ్వేల్ పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కాంట్రిబ్యూటరీ పెన్షన్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరుతూ గజ్వేల్‌లో తలపెట్టిన ఆయుత ధర్మదీక్షకు ఉద్యోగ, ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు. జిల్లా ప్రధాన కార్యదర్శి బీరకాయల తిరుపతి, కోశాధికారి వీరేశం, చంద్రోజు శ్రీనివాస్, సంతోష్‌రెడ్డి, శివకుమార్ ఉన్నారు.

## విద్యార్థులకు బిర్యానీ భోజనం

**.వర్గల్, జనవరి 6:** రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధి కోసం ప్రత్యేక దృష్టి పెట్టిందని మండల విద్యాధికారి రాములు అన్నారు. శనివారం మండలంలోని ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వ ఆదేశాల మేరకు మధ్యాహ్న భోజనం బదులు బిర్యాని భోజనం అందించామన్నారు. ప్రభుత్వం నుంచి సర్క్యులర్ ఆలస్యంగా రావడంతో కొన్ని పాఠశాలలో బిర్యాని భోజనం పెట్టలేకపోయామన్నారు. అలాగే విద్యార్థులకు మెరుగైన విద్యను అందిస్తూ పదో తరగతిలో ఉత్తీర్ణతా శాతం పెంచుతామన్నారు.

## ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం ప్రారంభం

**మర్కుక్, జనవరి 6:** ఎర్రవల్లి గ్రామంలో గజ్వేల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు చేపట్టిన ఎన్‌ఎస్‌ఎస్ శిబిరాన్ని శనివారం గ్రామ సర్పంచ్ భాగ్యబాల్‌రాజు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు, ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

# ఆ నలుగురు?

**పెళ్లికి పిలిస్తే వెళ్లాలి.. చావు కబురు తెలిస్తే వెళ్లాలి అని పెద్దలు చెబుతుంటారు. కానీ ప్రస్తుత సమాజంలో చావుకు పిలిచినా వెళ్లలేని దుస్థితి. గ్రామీణ ప్రాంతాల నుంచి ఇతర దేశాలకు వెళ్లిన వారు తమ తల్లిదండ్రుల అంత్యక్రియలకు కూడా రాలేకపోతున్నారు. ఇంకొంతమంది బతికున్నప్పుడు తమ కోసం ఏమీ చేయలేదని రావడంలేదు. ఇప్పుడు నలుగురి ఆప్యాయతను సంపాదించుకోవడం గగనమైపోయింది. ఆత్మ అజాత శత్రువని భీష్ముడు భారతంలో చెప్పాడు.. అందుకే ఎవరైనా మరణిస్తే ఆ నలుగురు మనమై అంత్యక్రియలు నిర్వహించాలని పెద్దలు సూచిస్తున్నారు.**

- వాహనం లేకపోతే మృతదేహం తరలని స్థితి
- గ్రామీణ ప్రాంతాల్లో పరిస్థితి మరీ దారుణం
- అడ్డంకులుగా మారిన ఆచార వ్యవహారాలు
- తగ్గుతున్న బాంధవ్యాలు

**అక్కన్నపేట, జనవరి5:** ఒక్కడై రావడం, ఒక్కడిగా పోవడం సృష్టి దర్మం. కాని ఆ పొయే క్రమంలో నలుగురి ఆప్యాయతను సంపాదించుకోవడం మంచి తనానికి నిదర్శనం. మరణానంతరం మృతదేహాన్ని మోసేందకు నలుగురిని సంపాదించుకోగలమా అనేది ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది. ప్రస్తుత సమాజంలో తమకు ఆస్థి పంచలేదని ఇతరులకు ఎక్కువగా ఇచ్చాడని, బతికుండగా మా ఇంటికి రాలేదని ఇలా అనేక కారణాలతో మరణించిన వారిపై కూడా పట్టు సాధించే సందర్భాలూ లేక పోలేదు. పెళ్లికి పిలిస్తే వెళ్లాలి. చావు కబురు తెలిస్తే రావాలి అనేది పెద్దల నానుడి. అయితే అది ఆచరణలో మాత్రం ఉండడం లేదు. ఆ శకునాలు.. ఈ శకునాలు అంటూ కొంత మంది, ఆస్థి తగాదాలు అంటూ మరికొంత మంది అత్యక్రియల వద్దకు వెళ్లకుండా దూరంగా ఉంటున్న రోజులివి. దీంతో అయిన వారితో అంత్యక్రియలు నిర్వహించుకోవడం అనేది ఎవరికో తప్ప సాధ్యం కావడం లేదు. గ్రామీణ ప్రాంతాల్లో ఇటువంటి పద్ధతులు ఎక్కువగా పాటిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో ఎవరైనా మరణిస్తే ఆ కుటుంబసభ్యులు ఆనలుగురి కోసం అన్వేషించాల్సి వస్తుంది.

ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లో నివాసం ఉండే వారిలో ఎక్కువ మంది వృద్ధులు కావడం. యువతరం వలసలు వెళ్లి పోవడం, ఎవరికి వారు దూరంగా నివసించడం. సమయానికి అందుబాటులో లేక పోవడం పెద్ద సమస్యగా మారింది. దీంతో అదే సామాజిక వర్గానికి చెందిన వారితో లేక దూరపు చుట్టాలను బతిమిలాడుకోవాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. కొరివి పెట్టడానికి కొడుకులు ఉన్నా వాళ్లు అమెరికా లేదా ఇతర దేశాల నుంచి రావడానికి మూడు నాలుగు రోజులు పట్టడంతో చేసేదేమి లేక అయిన వాళ్లే అంత్యక్రియలు నిర్వహిస్తున్న ఘటనలు పరిపాటిగా మారాయి. ఒకప్పుడు సంప్రదాయాలు, విలువలు కట్టు బాట్లకు పెద్ద పీట వేసే వారు నేడు కనీసం తలకొరివి పెట్టించుకోలేని దుస్థితి.. మారుతున్న సామాజిక, ఆర్థిక పరిస్థితులకు నిదర్శనం. పుత్రుడు పున్నామనరకం నుంచి తప్పిస్తాడనేది నిజమో, కాదో తెలియదు కాని మరణించిన మనిషి ఆత్మతృప్తికి మాత్రం అది అవసరం. తల కొరివి పెట్టడమొక్కటే కాదు తన గోత్రికులు, తనను ఘనంగా సాగనంపాలనేది కూడా వారి ఆలోచన. కొందరు వృద్ధులయితే తాము కాలం చేస్తే తల కొరివి పెట్టేందుకు కచ్చితంగా రావాలంటూ బతిమిలాడుకుంటున్న సందర్భాలూ లేక పోలేదు. వారి వేదన, ఆవేదన చూసిన కొందరు ముసలోడు ఇలా మాట్లాడుతున్నాడేంటి అని కొట్టి పారేస్తారు. ఆర్థిక సంబంధాలే అన్నింటినీ శాషిస్తున్న రోజులివి. ఇటీవల ఎక్కడైనా ఓ మనిషి చనిపోతే సంబంధిత వ్యక్తి తాలుకూ పెద్దమనిషి కాటికి ఎవరు తీసుకెళ్తారా అనే ఆలోచనలో పడుతున్నాడు. పట్టణ, గ్రామీణ ప్రాంతం అని తేడా లేకుండా అన్ని ప్రాంతాల్లో ఉన్న దుస్థితి ఇది. మారుతున్న కాలంలో పార్థివ దేహాలను తీసుకెళ్లేందుకు పలు స్వచ్ఛంద సంస్థలు కృషి చేస్తున్నాయి. ఇన్ని సదుపాయాలు ఉన్నా.. కనీసం పార్థివ దేహన్ని వాహనం వద్దకు తీసుకెళ్లేందుకు కాని అనంతరం అంత్యక్రియల ప్రదేశంలో నిర్వహించేందుకు తప్పనిసరిగా ఆ నలుగురి అవసరం ఉంది. ఆ నలుగురిని వెతుక్కునే పరిస్థితి ఎలా ఉన్న తల కొరివి పెట్టేవాడి కోసం వెతుక్కుంటున్న ఈ రోజుల్లో ఆ నలుగురిని సంపాదించగలిగిన వాడు నిజంగా గొప్పవాడే.


గరుడ వాహనం


వైకుంఠ ధామం

మనిషి చనిపోతే అంత్యక్రియలు నిర్వహించడానికి కుమారుడు, పార్థివ దేహన్ని తీసుకెళ్లేందుకు నలుగురు గోత్రికులు( వంశీకులు), ఉండి తీసుకెళ్తే చనిపోయిన వ్యక్తి ఆత్మ శాంతిస్తుందనేది నమ్మకం. ఈ నమ్మకాన్ని నమ్ముకుంటే శవం కదిలే పరిస్థితి లేదు. గోత్రికులు కాదు కదా కనీసం అదే సామాజిక వర్గానికి చెందిన వారు కూడా అందుబాటులో ఉండడంలేదు. కొన్ని చోట్ల ఈ సంప్రదాయానికి తెరదించి మానవత్వం ఉన్న ప్రతి ఒక్కరూ ఈ ప్రక్రియకు సహకరించడం సంతోషించాల్సిన విషయం. పట్టణ ప్రాంతాలకు గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చి ఊరికి ఒక్కరు స్థిర పడిపోయారు. దీంతో ఒక్క వంశానికి సంబంధించిన వారు ఒక్క చోటుకు రావడం అనేది అసాధారణం.

## కనుమరుగవుతున్న బంధాలు

శరీరం నుంచి ఆత్మ వదిలిన తర్వాత అతడు ఆజాత శత్రువని బీష్ముడు భారతంలో చెప్పాడని పెద్దలు చెబుతుంటారు. దీనిని ప్రామాణికంగా తీసుకున్న మృతదేహంపై సాధింపులు అవసరం లేదు. నలుగురు వెళ్లి ఆ ప్రక్రియ నిర్వహిస్తే వారికి గౌరవం పెరుగుతుందే కాని తగ్గదు. ఇది తెలుసు కోలేక ఎదో సాధించామని చనిపోయిన మనిషిపై లేని పోని ప్రచారాలు చేసి అబాసు పాలవుతున్నారు. అన్నింటినీ పక్కన బెట్టి అంత్యక్రియలకు హాజరై సంప్రదాయాలను గౌరవిస్తే.. భావి తరాలకు ఉన్నత సాంకేతాలు ఇచ్చిన వారమవుతాం. అందుబాటులో లేని వారికి స్నేహితులే బంధువులు. అందుబాటులో ఉన్న వారు సంప్రదాయాలను గౌరవించాలని పెద్దలు సూచిస్తున్నారు.

## అడ్డంకులుగా మారిన ఆచారాలు

అదే వంశానికి చెందిన గోత్రికులు తీసుకెళ్తే మంచిది.. అనేది నేటికి అనుసరిస్తున్న సంప్రదాయం. దీనిని నేటి తరానికి ఆచరించాలనే కోరికలున్నా అవి నెరవేరని పరిస్థితి. కనీసం ఒకే సామాజిక వర్గానికి చెందిన వారైనా ఈ కార్యక్రమంలో పాలు పంచుకోవాలనేది కూడా సంప్రదాయమే. దీనికి ఎదురు వెళ్లలేక ఆ సామాజిక వర్గం వారు అందుబాటులో లేక కొందరు సతమతమవుతాన్నారు. ఈ సంప్రదాయాలను కాదని అనేక చోట్ల మృతుడిపై అభిమానం ఉన్న వారు సామాజిక వర్గంతో సంబంధం లేకుండా అంత్యక్రియలు నిర్వహిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఈ మార్పు కనబడడం లేదు.

## గ్రామీణ ప్రాంతాల్లో మరీ దారుణం...

పట్టణ ప్రాంతాల్లో గరుఢ వాహనాల పేరుతో మృత దేహలను తీసుకెళ్లేందుకు కొన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. దీంతో ఈ ప్రక్రియ కొంత మేర సజావుగానే సాగుతున్నది. గ్రామీణ ప్రాంతాల్లో మాత్రం ఇలాంటి ఏర్పాట్లు లేవు. దీనికి తోడు స్మశానాలు గ్రామానికి దూరంగా ఉండడం కనీసం 5 కిలోమీటర్ల పైగా నడవాల్సిన పరిస్థితి ఉండడంతో ఎవరూ ముందుకు రావడం లేదు. వాహనాలు అందుబాటులో ఉండవు. సంప్రదాయాలకు ఎదురెళ్లలేరు. దీంతో అంత్యక్రియల ప్రక్రియ క్లిష్టంగా మారుతున్నది.

# సెల్‌ఫోన్ భూతం

- వ్యసనంగా మారుతున్న స్మార్ట్ ఫోన్ వాడకం
- పిల్లల ఎదుగుదలపై దుష్ప్రభావం
- పిల్లల్లో పెరుగుతున్న దృష్టి లోపం
- తల్లిదండ్రులే కారణమంటున్న నిపుణులు

**కొమురవెల్లి రూరల్, జనవరి 6:**

**చింటూ సెల్‌ఫోన్‌తో ఆడడం ఇక ఆపేయ్రా.. ఓ తల్లి అరుపు.**

**ఇప్పుడే కదా మొదలు పెట్టా.... చింటూ సమాధానం.**

ఈ సంభాషణ ప్రతి ఇంట్లో ఉండేదే. సెలవు రోజుల్లో ఇంకా ఎక్కువ సార్లు వినిపిస్తుంది. తల్లిదండ్రులు హాలీడేను జాలీడేగా పరిగణించే రోజులు పోయాయి. రిస్క్‌డేగా భయపడుతున్నారు. పిల్లలకు సెల్‌ఫోన్ వినియోగం ఓ వ్యసనంలా మారిందని తల్లిదండ్రుల ఆరోపణ. సెలవు రోజు కూడా ఫోన్‌తో ఆడనివ్వరన్నది పిల్లల ఆరోపణ. అలవాటు ముదిరి వ్యసనం అవుతుందని ఫలితంగా పిల్లలు భవిష్యత్తులో తీవ్ర దుష్ప్రభావానికి లోనవుతారని నిపుణులంటున్నారు. పెరుగుదల గణనీయమైన రీతిలో ఉండే బాల్యంలో శారీరక శ్రమ లేకపోవడం వల్ల పిల్లల్లో శరీర అభివృద్ధి కావలసినంత జరగడం లేదని ఫలితంగా భవిష్యత్తులో తీవ్ర దుష్ప్రభావాన్ని చూపుతుందని వైద్యులంటున్నారు. తల్లిదుండ్రులు పిల్లలతో కాసేపు సరదాగా గడపడంలో విఫలమవుతున్నారని, విరామం లేని జీవితంలో తమ విద్యుక్తధర్మాన్ని నిర్వహించడం లేదని మానసిక శాస్త్రవేత్తల అభిప్రాయం. ఫలితంగా పిల్లలు దారి తప్పుతున్నారని దీనికి ప్రధానకారణం తల్లిదండ్రులేనని శాస్త్రవేత్తలు తెలుపుతున్నారు.

## స్మార్ట్ ఫోన్ వాడకం వల్ల సమస్యలు

స్మార్ట్‌ఫోన్‌ను అధికంగా వాడడం వల్ల అలసట, తీవ్రమైన కళ్ల మంటలు, కళ్లు కరకరలాడడం, వస్తువులు మసకబారినట్టు కనబడడం, తలనొప్పి, మెడనొప్పి, వెన్ను నొప్పి, దృష్టిలోపం వంటి సమస్యలు ఉత్పన్నమవుతాయని నిపుణులంటున్నారు.

## పిల్లలతో గడపడమొక్కటే మార్గం



నేటితరం పిల్లలు శారీరకబలాన్ని పెంచే ఆటలకన్నా మొబైల్ గేమ్స్ పైనే ఎక్కువ శ్రద్ధ వహిస్తున్నారు. దీనికి ప్రధాన కారణం తల్లిదండ్రులు తగినంత సమయం వారికోసం కేటాయించకపోవడమే. చిన్న వయసులో పిల్లల మానసిక స్థితిని నియంత్రించడం సులభం. హోమ్వర్క్‌లో సహాయపడడం, కథలు చెప్పడం, వినడం, పిల్లలకు ఇష్టమైన రంగాన్ని గుర్తించి, వారి మనసును దానిపైకి మళ్లించడం, ఇంటిపనుల్లో పిల్లలు భాగస్వాములయ్యేలా ప్రోత్సహించడం, దినపత్రికలు చదివించడం వల్ల పిల్లలను ఫోన్‌కు దూరం చేయొచ్చు. పేరెంట్స్ ఎక్కువ సమయం తమ పిల్లలతో గడపడం అత్యుత్తమ మార్గం. స్మార్ట్ ఫోన్ నుంచి మామూలు ఫోన్‌కి మారడం మరోమార్గం. ప్రస్తుత ఇది అంత సులభం కాకున్నా తర్వాతి తరం భవిష్యత్తు కోసం అత్యవసరం. చదువు విషయంలో అత్యవసరమైతే తప్ప సెల్‌ఫోన్ ఇవ్వకూడదు. మానవ సంబంధాలను విచ్ఛిన్నం చేయగల శక్తిగా మారుతున్న ఈ సాధనాన్ని ఎంతవరకు వాడాలో పిల్లలకు ఎప్పటికప్పుడు తెలియజేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

**–జైపాల్‌రెడ్డి, వ్యక్తిత్వ వికాస నిపుణుడు**


స్మార్ట్ ఫోన్ లో లీనమైన పిల్లలు

## అతిగా వాడడం ఎంతో ప్రమాదం



సెల్ ఫోన్ వాడకం పిల్లల కంటిపై తక్షణ తీవ్ర ప్రభావం చూపుతుంది. స్మార్ట్ ఫోన్ నుంచి విడుదలయ్యే రేడియేషన్ ఎంతో ప్రమాదకరం. ఫలితంగా కలిగే ఒత్తిడి వల్ల కంటిలోని తడి ఆరిపోతుంది. ఈ సమయంలో మంట, ఇరిటేషన్ కలుగుతుంది. కళ్లు నలుపుకోవడం చేస్తారు. ఈ సమయంలో తల్లిదండ్రులు గుర్తించి తగు చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. లేకపోతే కంటి వ్యాధి నిరోధకశక్తి తగ్గి కంజెక్టివిటీస్ అనే వ్యాధి బారిన పడతారు. జ్ఞానేంద్రియాల్లో అతి సున్నితమైన అత్యవసరమైనవి కళ్లు. దీనిలోని కండరాలకు నిరంతర వ్యాయామం అవసరం. అయితే పిల్లల్లో తదేకంగా ఫోన్ వాడకం వల్ల కనుగుడ్డు సామర్థ్యం తగ్గిపోతుంది. ఫలితంగా ఈ మధ్య కాలంలో డ్రై ఐస్ సిండ్రోమ్ అనే వ్యాధి బారిన పడుతున్నారు. అందువల్లనే చాలా మందికి పిల్లలకు అద్దాలు వాడడం అధికమవుతున్నది. ఎక్కువ నీటిని తాగుతూ కనురెప్పలను ఆర్పుతూ ఉండడం వల్ల సమస్య నుంచి ఉపశమనం పొందవచ్చు.

**– సత్యానారాయణ, నేత్రవైద్యుడు**

# పుడమి మురిసేలా..

- మెదక్‌లో ఆకట్టుకున్న 'ఆంధ్రజ్యోతి' ముగ్గుల పోటీ





ప్రథమ బహుమతి పొందిన ముగ్గుతో విజేత అవంతి, ముగ్గు వేస్తున్న ద్వితీయ విజేత సౌమ్య, ముగ్గు వేస్తున్న తృతీయ విజేత శ్వేత, పోటీల పర్యవేక్షకుడు శంకర్‌గౌడ్‌కు జ్ఞాపికను అందజేస్తున్న జేసీ, స్పాన్సర్ శ్రీనివాస్ చౌదరి






అందమైన రంగవల్లులు అవనికే కొత్త అందాలను తెచ్చిపెట్టాయి. మెదక్ జిల్లా కేంద్రంలో ఆంధ్రజ్యోతి–ఏబీఎన్ నిర్వహించిన టాటా జెమిని టీ ముత్యాల ముగ్గుల పోటీలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ పోటీలు టేస్టు పార్ట్‌నర్ గోల్డ్ డ్రాప్, ఫ్యాషన్ పార్ట్‌నర్ డిగ్‌సెల్, హెల్త్ పార్ట్‌నర్ అమృతబిందు సౌజన్యంతో స్థానిక వెంకట్రావ్‌నగర్ కాలనీలోని సిద్దార్థ్ మోడల్ హైస్కూల్ ఆవరణలో నిర్వహించారు. పోటీలకు స్పాన్సర్‌గా శ్రీనివాస్ చౌదరి వ్యవహరించగా.. అతిథిగా జేసీ నగేష్ హాజరయ్యారు.






ప్రథమ బహుమతిగా అవంతికి నగదును అందజేస్తున్న జేసీ నగేష్, ఆర్డీవో నగేష్, డీఎఫ్‌వో పద్మజారాణి, స్పాన్సర్ శ్రీనివాస్‌చౌదరి, సంధ్యారాణి, ఆంధ్రజ్యోతి జిల్లా ప్రతినిధి పరశురాం, ద్వితీయ బహుమతిని అందుకుంటున్న సౌమ్య, తృతీయ బహుమతిని అందుకుంటున్న శ్వేత


ముగ్గులను పరిశీలిస్తున్న డీఎఫ్‌వో పద్మజారాణి






నవ్య, అమృతబిందు, డిగ్‌సెల్, జెమినీ టీ, ఏబీఎన్–ఆంధ్రజ్యోతి లోగోలను వేస్తున్న విద్యార్థులు


ముగ్గులను పరిశీలిస్తున్న న్యాయనిర్ణేతలు పద్మావతి, కల్యాణి


ఓ చేతిలో బిడ్డ.. మరో చేత్తో ముగ్గు


వ్యాఖ్యాత శ్రీనివాస్‌కు జ్ఞాపికను అందజేస్తున్న ఆంధ్రజ్యోతి బృందం


ముగ్గులను తిలకిస్తున్న మహిళలు

# విషయాధారిత వాదాన్ని ప్రతిపాదించినవారు?

## నమూనా ప్రశ్నలు

**1. ఉపాధ్యాయుడు తరగతి గదిలో ఉపయోగించాల్సిన పద్ధతులు, సాధనాలు, విషయ పరిజ్ఞానాన్ని తెలియజేస్తూ అది విద్యార్థుల్లో ఎలా నిర్దిష్ట లక్ష్యాలను సాధించేందుకు ఉపయోగపడతాయో సూచించే పథకమే పాఠ్యపథకం...అని నిర్వచించింది?**

1) ఎల్.బి.స్టాండ్ 2) బోసింగ్
3) బైనింగ్ అండ్ బైనింగ్ 4) స్టీవెన్సన్

**సమాధానం: 2**

**వివరణ:** ఒక పీరియడ్‌లో బోధించాలని నిర్ణయించిన దాన్ని పీరియడ్ పథకం లేదా పాఠ్య పథకమని అంటారు. ఇది ఉపాధ్యాయుడు తరగతి గదిలో బోధించాల్సిన విధానాన్ని తెలిపే ప్రక్రియ. ఇది ఉపాధ్యాయుని కార్యక్రమాలు, పాఠ్యాంశంపై ఉన్న అవగాహన తదితర అంశాలను తెలియజేస్తుంది. ఆవశ్యకత, లక్షణాలు తదితరాల ఆధారంగా పీరియడ్ పథకం లేదా పాఠ్యపథకానికి విద్యారంగ నిపుణులు వివిధ రకాలుగా నిర్వచించారు.

**2. 'భారతదేశం-నదీ వ్యవస్థ'కు సంబంధించి బోధనలో భాగంగా ఉపాధ్యాయుడు... విద్యార్థులతో భారతదేశ మ్యాప్‌లో నదులను గుర్తించడాన్ని అభ్యసింపజేస్తున్నాడు. ఇది పీరియడ్ ప్రణాళికలోని ఎన్నో బోధన సోపానం?**

1) 1 2) 2 3) 3 4) 4

**సమాధానం: 4**

**వివరణ:** సాంఘికశాస్త్ర బోధనకు సంబంధించి పీరియడ్ ప్రణాళికలో నాలుగు బోధన సోపానాలున్నాయి. అవి...1.ఉపోద్ఘాతం(పలకరింపు, మైండ్ మ్యాపింగ్/పునశ్చరణ ప్రశ్నలు;పాఠ్యాంశ ప్రకటన); 2.పాఠ్యాంశాన్ని చదివి తెలియని పదాలు, భావనలను గుర్తించడం(గుర్తించడం, అవగాహన కలిగించడం, భావనల అవగాహన-చర్చ); 3.భావనల అవగాహన-చర్చ(మాట్లాడించడం, ప్రశ్నించడం, భావనలపై అవగాహన ప్రశ్నలు); 4.నైపుణ్యాల అభ్యసన(సమాచార నైపుణ్యాలు, పట నైపుణ్యాలు). దీనివల్ల పిల్లల్లో సమాచార నైపుణ్యాలపై సేకరణ, నమోదు, విశ్లేషణ, నిర్ధారణకు రావడం తదితర లక్షణాలు పెంపొందుతాయి.

**3. మానవులను సామాజిక సమూహాలుగా ఐక్యపరిచే పవిత్ర విశ్వాసాలు, ఆచారాల వ్యవస్థే మతం...అని అన్నది?**

1) డర్ఖీహామ్ 2) జోసెఫ్ డి.నోవక్
3) పటేల్ కమిటీ 4) జాన్‌డ్యూయీ

**సమాధానం: 1**

**వివరణ:** శారీరక లక్షణాలు, తెలివితేటలు, వారసత్వ ప్రభావాలు తదితర అంశాలను భౌతికాంశాలుగా; మతం, కులం, సంస్కృతి, ఆర్థిక పరిస్థితులు, రాజకీయ పరిస్థితులు, సామాజిక వర్గాలు తదితర అంశాలను సాంఘిక అంశాలుగా చెప్పొచ్చు. ప్రస్తుతం సమాజ వికాసంలో సాంఘికాంశాలు కీలకపాత్ర పోషిస్తున్నాయి. ఈ క్రమంలో పాఠ్యప్రణాళిక, విద్యా లక్ష్యాలు, బోధన పద్ధతులు తదితరాలను సాంఘికాంశాలు శాసిస్తున్నాయి. ప్రస్తుతం సాంఘికశాస్త్ర అవగాహనకు వివిధ అంశాలు తోడ్పడుతున్నాయి. అవి...మతం, కులం, సామాజిక వర్గం, విజ్ఞానశాస్త్రం, రాజకీయ పరిస్థితులు, ఆర్థిక పరిస్థితులు. వీటిలో మతానికి డర్ఖీహామ్ ఆలోచనాత్మక నిర్వచనం ఇచ్చాడు.

**4. 'పిల్లలకు నిజాయితీని అలవరచడం విద్యాభ్యాసంలో తొలిమెట్టు' అని చెప్పినవారు?**

1) జాన్ వి.షైఖేలిన్ 2) సెకండరీ విద్యా కమిషన్
3) జాన్‌రస్కిన్ 4) జేమ్స్ హెమ్మింగ్స్

**సమాధానం: 3**

**వివరణ:** సమాజంలో ఒక సభ్యుడిగా మనిషి సముపార్జించుకున్న విజ్ఞానం, విశ్వాసం, కళ, నీతి సూత్రాలు, న్యాయం, ఆచారాలు, ఇతర సామర్థ్యాలు, అలవాట్లను మొత్తంగా కలిపి సంస్కృతిగా చెప్పొచ్చు. సాంఘికశాస్త్ర అవగాహనలో వివిధ సాంస్కృతిక అంశాలు, పాత్ర పోషిస్తాయి. ఈ క్రమంలోనే పిల్లలకు నిజాయితీని అలవరచడం విద్యాభ్యాసంలో తొలిమెట్టు అని ప్రముఖ బ్రిటిష్ సామాజికవేత్త జాన్ రస్కిన్(1819-1900) పేర్కొన్నాడు.

**5. సామూహిక కృత్యమైన 'క్విజ్' ద్వారా సాంఘికశాస్త్ర ఉపాధ్యాయుడు విద్యార్థుల్లో పెంపొందించే అంశాలు?**

1) విషయ పరిపుష్టి 2) పఠనాసక్తి
3) నైపుణ్యాభివృద్ధి 4) పైవన్నీ

**సమాధానం: 4**

**వివరణ:** సాంఘికశాస్త్రాలకు సమాజమే ఒక ప్రయోగశాల కాబట్టి పిల్లలు సమాజంలోని కుటుంబం, సామాజిక సంస్థలు, పాఠశాల ఉపాధ్యాయుడు, సమ వయస్సు బృందాలు, సహ విద్యార్థులు తదితరాల నుంచి ఎన్నో విషయాలు నేర్చుకుంటారు. అయితే ఆ విధంగా నేర్చుకునేందుకు ఉపాధ్యాయుడు అనువైన వాతావరణాన్ని ఏర్పరచాలి. క్విజ్; ఆల్బమ్/స్క్రాప్‌బుక్ తయారీ; స్టాంపులు, నాణేల సేకరణ; సాంఘికశాస్త్ర మేళాల నిర్వహణ; సామాజిక సేవా కార్యక్రమాలు; సాంఘికశాస్త్ర క్లబ్బులు తదితరాలను నిర్వహించాలి. ఈ కార్యక్రమాల నిర్వహణలో ఉపాధ్యాయుడు బోధకుడి పాత్ర నుంచి సహకారి, సహ అభ్యాసకుడి పాత్రను పోషించాల్సి ఉంటుంది. సామూహిక కృత్యాల్లో క్విజ్ కీలకమైనది. దీనివల్ల విద్యార్థుల్లో విషయ పరిపుష్టి, పఠనాసక్తి, నైపుణ్యాభివృద్ధితో పాటు బృందాల మధ్య పోటీతత్వం పెంపొందించవచ్చు. విద్యార్థుల్లో దాగియున్న అంతర్గత శక్తి సామర్థ్యాలను వెలికితీయొచ్చు. అదే విధంగా అభ్యసనలో యాంత్రికతను దూరం చేయొచ్చు.

## ఎస్‌జిటి సోషల్ మెథడ్స్

**6. సాంఘికశాస్త్ర ఉపాధ్యాయుడు ఇటీవల ఆంధ్రజ్యోతి పత్రికలో సింగరేణి బొగ్గు గనులకు సంబంధించి ప్రచురితమైన ఓ చిత్రాన్ని విద్యార్థులకు చూపిస్తూ...దానిపై ప్రశ్నలు అడిగాడు. విషయాధారిత ఉపగమంలో ఈ ప్రశ్నలు ఏ రకానికి సంబంధించినవి?**

1) అనుమతి ప్రశ్నలు 2) వ్యాఖ్యాన ప్రశ్నలు
3) బదిలీ ప్రశ్నలు 4) పరికల్పన గురించి ప్రశ్నలు

**సమాధానం: 1**

**వివరణ:** విచారణాధారిత ఉపగమంలో ఉపాధ్యాయుడు కేవలం సౌకర్యకర్తగా ఉంటూ, విద్యార్థిలో రేకెత్తిన భావ సంచయనాన్ని, క్రమబద్ధ క్షేత్ర నియమాలతో అనుసంధానం తదితరాల ద్వారా సక్రమ అభ్యసన జరిగేందుకు కృషిచేస్తాడు. ప్రశ్నలు సొంత పరిశోధనకు గుండెకాయలాంటివి. ప్రశ్నలు సంప్రదాయ తరగతిలో ఒక భాగం. ప్రశ్నాపద్ధతులు విద్యార్థుల్లో నైపుణ్యాల పెంపుదలకు ఉపయోగకరంగా ఉండాలి. విషయాధారిత ఉపగమంలో నాలుగు రకాల ప్రశ్నలను పేర్కొన్నారు. అవి... 1. అనుమతి ప్రశ్నలు; 2. వ్యాఖ్యాన ప్రశ్నలు; 3. బదిలీ ప్రశ్నలు; 4. పరికల్పన గురించి ప్రశ్నలు. అందుబాటులో ఉన్న సమాచారం ఆధారంగా అనుమతి ప్రశ్నలుంటాయి. ఈ రకం ప్రశ్నల ద్వారా విద్యార్థులు తక్షణమే జ్ఞానార్జన చేస్తారు.

**7. ఎరిక్సన్ మనోవైజ్ఞానిక భావాలపై ఆధారపడిన సాంఘిక జట్టుపనిలోని విధానం?**

1) నివారణ పద్ధతి(Remidial Model)
2. అన్యోన్య లేదా మధ్యవర్తిత్వ పద్ధతి(Reciprocal or Mediatory Model)
3. అభివృద్ధి పద్ధతి(Development Model)
4. సాంఘిక లక్ష్య పద్ధతి(Social Goal Model)

**సమాధానం: 3**

**వివరణ:** వ్యక్తి సొంతంగా నిర్వహించిన సామాజిక పనికంటే సామూహికంగా లేదా జట్టుగా చేసిన పని ఫలితం ఎక్కువగా ఉంటుంది. జట్టుపని వల్ల నైపుణ్యాలు ఎక్కువగా అభివృద్ధి చెందుతాయి. సాంఘిక జట్టుపనిలో నాలుగు విధానాలున్నాయి. అవి.. 1) నివారణ పద్ధతి 2) అన్యోన్య లేదా మధ్యవర్తిత్వ పద్ధతి 3) అభివృద్ధి పద్ధతి 4) సాంఘిక లక్ష్య పద్ధతి. ఎరిక్సన్ మనోవైజ్ఞానిక భావాలపై అభివృద్ధి పద్ధతి ఆధారపడి ఉంటుంది. ఇది బృంద వైశిష్ట్యాలు, సంఘర్షణ సూత్రంపై నిర్దిష్టత కలిగి ఉంటుంది. బృందాలు పూర్తి స్వేచ్ఛ కలిగి, ఏకచ్ఛత్రాధిపత్యం కలిగి ఉంటాయి. బృందాల్లోనివారు ఆయా సంఘాల్లోని భావాలకు అనుగుణంగా ప్రవర్తిస్తారు. లక్ష్యాల సాధనకు అభివృద్ధి పథంలో పయనిస్తారు.

**8. భారతదేశ జీవ నదులు అనే పాఠ్యాంశ బోధనలో భాగంగా ఉపాధ్యాయుడు ఓ వీడియో ఆధారంగా బోధిస్తున్నాడు. ఇది సాంఘిక శాస్త్ర బోధనావనరుల్లో ఏ రకమైన వనరు?**

1) భౌతిక వనరు 2) లిఖిత/అలిఖిత వనరు
3) ద్వితీయ వనరు 4) ఏదీకాదు

**సమాధానం: 2**

**వివరణ:** సాంఘికశాస్త్ర బోధన వనరులను ప్రధానంగా రెండు రకాలు విభజించొచ్చు. అవి... 1. ప్రాథమిక వనరులు(Primary Sources), 2. ద్వితీయ వనరులు(Secondary Sources). ప్రాథమిక వనరుల్లో భౌతిక వనరులు, లిఖిత/అలిఖిత వనరులు ఉంటాయి. కట్టడాలు, దేవాలయాలు, మ్యూజియాలు, కళాకృతులు, పాత్రలు తదితరాలు భౌతిక వనరుల కిందకు వస్తాయి. డైరీలు, ఉపన్యాసాలు, మౌఖిక చరిత్రలు, ఆడియో, వీడియో రికార్డింగ్, జనాభా రికార్డులు, చాయాచిత్రాలు, పోస్టరులు తదితరాలను లిఖిత/అలిఖిత వనరులుగా చెప్పొచ్చు.

**9. భారతదేశాన్ని సందర్శించిన మొదటి విదేశీ యాత్రికుడు మెగస్తనీస్ కాగా, మనదేశాన్ని సందర్శించిన తొలి చైనా యాత్రికుడు ఎవరు?**

1) ఫాహియాన్ 2) హుయాత్సాంగ్
3) అల్‌బరూని 4) మార్కోపోలో

**సమాధానం: 1**

**వివరణ:** బౌద్ధమత గ్రంథాల్లో నిక్షిప్తమైయున్న భారతీయ సంప్రదాయాల గురించి తెలుసుకునేందుకు, వాస్తవ నిరూపణల కోసం ఫాహియాన్ క్రీ.శ.399లో గుప్తుల కాలంలో దేశంలో పర్యటించాడు. భారత్‌లోని తన అనుభవాలను, భారతీయ తత్వశాస్త్ర గొప్పతనాన్ని తన 'ప్రయాణ దర్శిని'లో రాశాడు. రెండో చంద్రగుప్త మౌర్యుని కాలంలో న్యాయం, ప్రజలపై రాజుల బాధ్యతలు తదితర అంశాలను క్షుణ్ణంగా వివరించాడు. ఫాహియాన్ 'ప్రయాణ దర్శిని'ని బౌద్ధమత ఇతిహాసంగా కూడా చెప్పొచ్చు.

**10. రాష్ట్రంలో 2012-17 మధ్యకాలంలో పప్పు ధాన్యాల ఉత్పత్తి గురించి బోధించేందుకు ఉపాధ్యాయుడికి అనువుగా ఉండే గ్రాఫ్‌లు?**

1) లైన్ గ్రాఫ్‌లు 2) బార్ గ్రాఫ్‌లు
3) సర్కిల్ గ్రాఫ్‌లు 4) చిత్రాల గ్రాఫ్‌లు

**సమాధానం: 2**

**వివరణ:** గణాంక పట్టికల వివరాలను విద్యార్థులకు వివరించడానికి గీతలు లేదా చుక్కల ద్వారా చూపే రేఖాచిత్రాలను గ్రాఫులంటారు. గ్రాఫుల్లో లైన్ గ్రాఫ్‌లు, బార్ గ్రాఫ్‌లు, సర్కిల్ గ్రాఫ్‌లు, చిత్రాల గ్రాఫ్‌లు, ప్లానల్ గ్రాఫ్‌లు ఉంటాయి. నిలువుగా లేదా అడ్డంగా పొడవైన స్తంభంలాంటి గీతల ద్వారా ఒక అంశంలో క్రమానుగత అభివృద్ధి లేదా మార్పులను బార్‌గ్రాఫ్‌ల ద్వారా చూపించవచ్చు.

**11. విషయాధారిత వాదాన్ని ప్రతిపాదించినవారు?**

1) రోజర్ శాంక్, అతని శిష్యబృందం
2) జాన్‌డ్యూయీ, అగస్టన్
3) యశ్‌పాల్ కమిటీ
4) సెకండరీ విద్యా కమిషన్

**సమాధానం: 1**

**వివరణ:** గత సమస్యల సాధన అనుభవం ద్వారా కొత్త సమస్యలను సాధించడం విషయాధారిత వాదం. ఇది కేవలం కంప్యూటర్ ఆధారిత సమస్యల సాధనకే కాకుండా, నిత్యజీవితంలో మనిషికి ఎదురయ్యే అన్ని రకాల సాధనకు ఉపయోగపడుతుంది. వ్యక్తిగతంగా గతంలో పొందిన అనుభవాల ఆధారంగా విషయాధారిత వాదం కొత్త సమస్యలను పరిష్కరిస్తుంది. ఈ వాదాన్ని 1980లో రోజర్‌శాంక్, ఆయన శిష్యబృందం ప్రతిపాదించారు.

- అశోకరాణి వడ్డమూరి, ప్రభుత్వ ఉపాధ్యాయిని.



# అలోవేరా డ్రింక్

స్వయం ఉపాధి




సామాజిక, ఆర్థిక అభివృద్ధితో ప్రజల అలవాట్లు, ప్రాధాన్యాలు మారడం సహజం. ఆరోగ్యంపై శ్రద్ధ పలితంగా శుచికరమైన ఆహారం, పానీయాలకు ప్రాధాన్యం పెరుగుతోంది. అందువల్లనే మనందరం కలబందగా పిలిచే 'అలోవేరా' ఆరోగ్య, సౌందర్య పరిరక్షణ, ఇతర ఉత్పత్తులకు డిమాండ్ క్రమేణా పెరుగుతోంది. నాణ్యమైన, ఆరోగ్యకరమైన ఉత్పత్తులు అందుబాటులో ఉంటే అవసరమైతే అధిక ధరలు చెల్లించి అయినా ఉపయోగించడానికి నేటి వినియోగదారులు వెనుకాడటం లేదు.

### కలబంద ప్రయోజనాలు

శరీరంలోని విష పదార్థాలను బయటకు పంపుతుంది, రోగనిరోధక శక్తిని వృద్ధి పరుస్తుంది. ఆల్కనైజింగ్ ప్రభావం వల్ల జీర్ణవ్యవస్థ వృద్ధి చెందుతుంది. అజీర్తి సమస్యను నివారిస్తుంది. మధుమేహాన్ని నియంత్రిస్తుంది. వడదెబ్బ, కాలిన గాయాలు పొడిచర్మం వల్ల సమస్యలను నివారిస్తుంది. నోటి సంబంధ వ్యాధులను నివారిస్తుంది. చర్మాన్ని ప్రకాశవంతం చేస్తుంది. పోషక విలువలను పెంచుతుంది. యాంటీ ఇన్‌ఫ్లమేటరీగా పనిచేస్తుంది. శరీర వృద్ధికి తోడ్పడుతుంది. అవసరమైన విటమిన్లను శరీరానికి అందిస్తుంది. క్యాన్సర్ రాకుండా నిరోధిస్తుంది. కాలేయాన్ని సమర్థంగా పనిచేయిస్తుంది.

అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉండటంతో అలోవేరా డ్రింక్‌ను ప్రతిరోజూ తీసుకుని ఆరోగ్యాన్ని వృద్ధి చేసుకోవచ్చు.

### రెడీ టు డ్రింక్ / సర్వ్ జ్యూస్

సింథటిక్ శీతల పానీయాల్లో అధికశాతం పెస్టిసైడ్స్ ఉంటున్నాయని, అవి ఆరోగ్యానికి హానికరంగా మారుతున్నాయని అనేక స్వచ్ఛంద సేవా సంస్థలు ఆధారాలతో సహా నిరూపిస్తున్నాయి. దాంతో ప్రజల్లోనూ వాటిపై వ్యతిరేకత వస్తున్నది. అందువల్ల నాణ్యమైన ముడి పదార్థాలతో రుచికరమైన రెడీ టు డ్రింక్ / సర్వ్ కలబంద పానీయం మంచి ప్రత్యామ్నాయ శీతల పానీయం అవుతోంది.

### తయారీ విధానం

నాణ్యమైన అలోవేరా జ్యూస్‌ను సేకరించాలి. ప్రత్యేక సాంకేతిక పరిజ్ఞానం అనుసరించి దానిని రెడీ టు సర్వ్ అలోవేరా జ్యూస్‌గా తయారు చేయవచ్చు. ప్యూర్ కలబంద జ్యూస్‌తోపాటు మామిడి, స్ట్రాబెర్రీ, లీచీ, దానిమ్మ, ఇతర పండ్ల ఫ్లేవర్స్‌ను కూడా చేర్చవచ్చు. సహజ ఆహార రంగులు, ప్రిజర్వేటివ్స్‌లతో రుచికరమైన, ఆరోగ్యకరమైన అలోవేరా జ్యూస్ తయారుచేయవచ్చు. ఒకసారి తాగడానికి వీలుగా 250 మి.లీ. పరిమాణంలో బాటిలింగ్ చేయడంతోపాటు, ఇంట్లో ఫ్రిజ్‌లో ఉంచుకొని తాగడానికి వీలుగా ఒక లీటరు బాటిల్స్ కూడా ప్యాకింగ్ చేసి మార్కెట్‌కు పంపవచ్చు.

### అవసరమైన యంత్రపరికరాలు

సుగర్ సిరప్ తయారీ యంత్రం, మిక్సింగ్ ట్యాంక్, పాశ్చరైజర్, బాటిలింగ్ యంత్రం, వర్కింగ్ టేబుల్స్, ఎస్ఎస్ పాత్రలు మొదలైనవి.

### ముడి పదార్థాలు

ఫుడ్ గ్రేడ్, ఆర్గానిక్ అలోవేరా జ్యూస్ (ఫైబర్ లేకుండా, పల్ప్‌పై బర్ కూడిన), నేచురల్ ఫ్రూట్ ఫ్లేవర్స్ కలర్స్, ప్రిజర్వేటివ్స్, బాటిల్స్, లేబుల్స్, కార్టన్ బాక్సులు మొదలైనవి.

### మార్కెట్ అవకాశాలు

నాణ్యమైన పద్ధతిలో తయారుచేసిన కలబంద జ్యూస్‌కు వినియోగదారుల ఆదరణ ఉంటుంది. పాన్‌షాపులు, కిరాణా, సూపర్ మార్కెట్స్ ద్వారా వినియోగదారులకు అందుబాటులో ఉంచడం అవసరం. ఆన్‌లైన్ విధానంలో కూడా మార్కెటింగ్ చేసుకోవాల్సి ఉంటుంది. నాణ్యమైన నూతన ఆహార ఉత్పత్తుల తయారీ పరిశ్రమ పై ఆసక్తి ఉన్న యువతకు రెడీ టు డ్రింక్ / సర్వ్ అలోవేరా జ్యూస్ పరిశ్రమ మంచి స్వయంఉపాధి అవుతుంది.



మైనంపాటి శ్రీనివాసరావు
బిజినెస్ కన్సల్టెంట్
సెల్: 9866119816

**పరిశ్రమ వ్యయం**

**ఉత్పత్తి సామర్థ్యం:** వెయ్యి లీటర్లు / రోజుకు
**పరిశ్రమ వ్యయం:** రూ.35 లక్షలు

# SSC CGL TIER-II *MODEL PAPER*

(నిన్నటి స్టడీ తరువాయి)

## ENGLISH LANGUAGE AND COMPREHENSION

**Directions (41-60): A sentence has been given in Active/Passive Voice. Out of the four alternatives suggested below, select the one which best expresses the same sentence in Passive/Active Voice.**

41. India is evolving a new plan to control her population.
(A) A new plan is evolved by India to control her population.
(B) A new plan has been evolved by India to control her population.
(C) A new plan was being evolved to control her population by India.
(D) A new plan is being evolved by India to control her population.

42. We found the lock broken last night.
(A) The lock was found by us breaking last night.
(B) The lock was found broken last night.
(C) The lock was broken by us last night.
(D) The broken lock we found last night.

43. They should shoot the traitor dead.
(A) The traitor should be shot at by them.
(B) The traitor should be shot them.
(C) The traitor should be shot dead .
(D) The traitor is shot by them.

44. Who inaugurated the fair?
(A) The fair was inaugurated by whom?
(B) The fair is inaugurated by who ?
(C) By whom was the fair inaugurated?
(D) By who was the fair inaugurated?

45. When he left school, the textbooks were put aside by him and were never reopened.
(A) After he left school, he put aside his textbooks and they were never reopened
(B) He put aside his textbooks when he left school and never reopened them.
(C) He put aside his textbooks when he left school and were never reopened by him.
